
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శుక్రవారం 22 ఆగస్టు 2025

ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 9, 10 తరగతులు చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ పొందేందుకు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ మహ్మద్ ఆయూబ్ ఓ ప్రకటనలో కోరారు. ఈ నెల 31లోగా www.scholarship.gov.in దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హులైన దివ్యాంగ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేపు 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రతీనెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఈ నెల 23వ తేదీ నిర్వహించాలని అధికారులకు జడ్పీ సీఈవో మోహన్‌రావు ఓ ప్రకటనలో సూచించారు. గత శనివారం కృష్ణాష్టమి పండుగ సందర్భంగా ఆ కార్యక్రమాన్ని ఈ వారానికి వాయిదా వేసినట్లు తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముంపు ఏర్పడకుండా కాలువల్లో పూడిక తీయడం, వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం వంటివి చేయాలని, అధికారులంతా ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆదేశించారు.

'డీకేడబ్ల్యూ'లో డిగ్రీలో చేరండి

నెల్లూరు(విద్య), ఆగస్టు (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో మహిళల కోసమే ప్రత్యేకమైన డీకే కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీఎస్సీ సైన్స్‌లో 12 కోర్సులు, బీఏలో ఐదు కోర్సులు, బీకామ్‌లో 4 కోర్సులు అందిస్తున్నామని తెలిపారు. ఇవికాక ఉపాధి ఆధారిత కోర్సులు, ఏడాది సమయం కలిగిన నానికేర్ కోర్సు కూడా అందుబాటులో ఉందని పేర్కొన్నారు. తొలివిడత ప్రవేశాలు ఈనెల 26వతేదీ వరకు జరుగుతాయని, కళాశాలలో హాస్టల్ వసతి కూడా ఉందని, విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కానిస్టేబుల్ ఉద్యోగాలకు రేపు సర్టిఫికెట్ల పరిశీలన

నెల్లూరు(క్రైం) ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన నెల్లూరు జిల్లా అభ్యర్థులకు శనివారం సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని ఎస్పీ జీ కృష్ణకాంత్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సివిల్, ఏపీ ఎస్పీ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు 23వ తేదీ నెల్లూరులోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరానికి ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు. అన్నీ ఒరిజనల్ సర్టిఫికెట్లపై గెజిటెడ్ అధికారులతో అటెస్టేషన్ చేయించి తీసుకురావాలని, ఇటీవల తీయించిన ఆరు పాస్‌పోర్టు సైజు కలర్ ఫొటోలు సమర్పించాలని సూచించారు. అభ్యర్థి పూర్తి వివరాలు నమోదు చేసిన పత్రంపై గెజిటెడ్ అధికారితో ధృవీకరించి అందజేయాలని తెలిపారు.

ప్రతి శాఖకు అభివృద్ధి లక్ష్యాలు

● జిల్లాలో సమృద్ధిగా ఇసుక : కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం) : ప్రతి ప్రభుత్వ శాఖకు అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించినట్లు కలెక్టర్ ఆనంద్ చెప్పారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయా నంద్ గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ శంకరన్ హాల్ నుంచి కలెక్టర్ పాల్గొని, మాట్లాడారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో ఇసుక నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, రెండు డిసిల్టేషన్ పాయింట్ల ద్వారా ఇసుకను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇసుకను పారదర్శకంగా పంపిణీ చేయడానికి అన్ని చర్యలు చేపట్టామని చెప్పారు.

రికార్డుల్లో ఏముంది...

ఎవరి పాత్ర ఎంత!?



'కి'లేడి' నిడిగుంట అరుణ వాడుతున్న సెల్‌ఫోన్‌లో రికార్డు అయిన వాయిస్ ఎవరిది? వీడియోలో ఎవరున్నారు? ఇంతకూ ఆమెకు సహకరించిన అధికారులు, ఉద్యోగులు ఎవరు? పోలీస్ శాఖలోనే ఎంత మంది ఉన్నారు? కోవూరు కేసుతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఇంకేమైనా ఫిర్యాదులు ఉన్నాయా!?." ఇలా అనేక అంశాలపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

● కి'లేడి' అరాచకాలపై పోలీసుల ఆరా ● రోజంతా విచారించిన ఏఎస్పీ సౌజన్య
● సహకరించిన వారి జాబితా సిద్ధం? ● రౌడీషీటర్ శ్రీకాంత్ ఆగడాలపైనా కూపీ లాగుతూ
● తమకు జరిగిన అన్యాయంపై బాధితుల గగ్గోలు ● నెల్లూరుకు వచ్చి ఫిర్యాదు చేయమంటున్న పోలీసులు

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన నిడిగుంట అరుణ, ఈమె ప్రియుడు, రౌడీషీటర్ అవిలేలి శ్రీకాంత్ ఆగడాలపై పోలీసులు లోతైన విచారణ సాగిస్తున్నట్లు సమాచారం. వీరిద్దరికి సహకరించింది ఎవరు? రాష్ట్రవ్యాప్తంగా వీరిఆగడాలు ఏంటి? బాధితులు ఎందరు? తదితర వాటిపై క్షుణ్ణంగా ఆరా తీస్తున్నారు. ఓ బిల్డర్ ఫిర్యాదు మేరకు కోవూరు పోలీసులు బుధవారం అరుణను అరెస్ట్ చేసి, ఒంగోలు జైలుకు తరలించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కోవూరు స్టేషన్‌లో నమోదైన కేసుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అరుణ చేసిన అరాచకాలపై పోలీసులు గురువారం లోతుగా విచారిస్తున్నారు. నెల్లూరులోని పోలీస్ కవాతు మైదానంలో ఉన్న పోలీస్ అతిథిగృహంలో అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య గురువారం అరుణకు సంబంధించిన పలు విషయాలపై పలువురిని విచారించినట్లు తెలిసింది. అరుణ వినియోగించిన ఫోన్‌లోని వాయిస్, వీడియో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇది బయటకు వస్తే సూత్ర, పాత్రధారులందరూ వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అలాగే, రౌడీషీటర్ శ్రీకాంత్, అరుణలకు గత ప్రభుత్వంలో సహకరించిన పోలీసు అధికారులు, ప్రస్తుత ప్రభుత్వంలో సహకరించిన ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగులు, ఏఆర్ సిబ్బంది ఎవరన్న దానిపై జాబితా సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇది బయటకు పొక్కడంతో పోలీసు శాఖలోనే గుబులు మొదలైంది.

● మేడం నన్ను మోసం చేశారు!

ప్రేమికుల దందాలపై విచారిస్తున్న సమయంలోనే విజయవాడ నుంచి ఓ వ్యక్తి ఫోన్ చేసి తన వద్ద అరుణ పెద్ద మొత్తంలో నగదు తీసుకొని మోసం చేసిందని, న్యాయం చేయాలని పోలీసు అధికారులతో చెప్పారు. అయితే, నెల్లూరుకు వచ్చి ఫిర్యాదు చేయాలని పోలీసులు ఆ వ్యక్తికి సూచించారు. శుక్రవారం ఆ వ్యక్తి నెల్లూరుకు రానున్నట్లు సమాచారం. కి'లేడీ'పై ఫిర్యాదు చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా బాధితులు నెల్లూరుకు తరలిరానున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పోలీసు అధికారులు సైతం ఫిర్యాదులపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ ఆదేశించినట్లు సమాచారం.

పల్లెకు చేరని స్థిరాస్తి వాటా

రిజిస్ట్రేషన్ శాఖ స్థానిక సంస్థలకు చెల్లించాల్సిన స్థిరాస్తి వాటా (ట్రాన్స్‌ఫర్ డ్యూటీ) చెల్లింపులో జాప్యం నడుస్తోంది. సుమారు రూ.35 కోట్లకుపైగా బకాయిలు ఉండటంతో పల్లెల ప్రగతికి ఆటంకం ఏర్పడుతోంది. అధికారులు కూడా నగదు చెల్లింపు విషయంలో పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారు.



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

● ట్రాన్స్‌ఫర్ డ్యూటీకి ఎగనామం
● రూ.35 కోట్లకుపైగా బకాయిలు
● పట్టించుకోని రిజిస్ట్రేషన్ శాఖ
● స్థానిక సంస్థల అభివృద్ధికి గండి

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఆస్తి కొనుగోలు, అమ్మకానికి రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించాలి. ఈ సమయంలో ట్రాన్స్‌ఫర్ డ్యూటీని (టీడీ) వసూలు చేయటం వల్ల ఎటువంటి ఎగవేతకు అవకాశం ఉండదు. ఈ మొత్తాన్ని పారదర్శకంగా సేకరించి సంబంధిత స్థానిక సంస్థల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. భూములు, స్థలాలు, ఇళ్లు, వాణిజ్య భవనాలు తదితర ఆస్తుల రిజిస్ట్రేషన్ సమయంలో రిజిస్ట్రేషన్ ఫీజులు వసూలు చేస్తారు. ఆ ఫీజులోనే 1.5 శాతం మొత్తాన్ని ట్రాన్స్‌ఫర్ డ్యూటీ చెల్లించాల్సి ఉంటుంది. దస్తావేజుల రిజిస్ట్రేషన్ ఫీజులు 7.5 శాతం కట్టించుకుంటారు. ఇందులో డెఫిసిట్ ఫీజు 6.5 శాతం ఉంటుంది. ఈ ఫీజులో 1.5 శాతం స్థానిక సంస్థలకు బదలాయించడానికి టీడీ ఫీజుగా కట్టించుకుంటారు. 1 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు ఉంటుంది. పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఈ టీడీ ద్వారా ఆదాయ వనరుల సమకూర్చుకుంటాయి. అభివృద్ధి పనులకు కూడా ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. వివిధ రకాల పన్నులు, ఇతర ఫీజులు మీద మాత్రమే ఆధారపడితే ఆశించినంత స్థాయిలో స్థానిక సంస్థలకు ఆదాయం సమకూరదు. ట్రాన్స్‌ఫర్ డ్యూటీ ద్వారా వచ్చే ఆదాయం వాటికి ఊపిరి పోసినట్టవుతుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రోడ్లు, వీధిదీపాలు, నీటి సైపులు, కాలువలు, పారిశుధ్య పనులు నిర్వహించే వీలు ఉంటుంది. అదనంగా పార్కులు, కమ్యూనిటీ హాళ్లు తదితర ప్రజా సౌకర్యాల కోసం కూడా ఆ మొత్తాన్ని ఖర్చు చేయవచ్చు.

సకాలంలో పంపుతాం

ట్రాన్స్‌ఫర్ డ్యూటీ మొత్తం వివరాలను పంచాయతీలు, మున్సిపాలిటీల వారీగా సబ్ రిజిస్ట్రార్‌ల నుంచి సేకరించాం. ఇంకా పూర్తి వివరాలు సేకరించి సకాలంలో స్థానిక సంస్థలకు చెల్లింపులు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. - బాలాంజనేయులు, జిల్లా రిజిస్ట్రార్

● రూ.కోట్లలోనే బకాయిలు

జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ స్థానిక సంస్థలకు రూ.35 కోట్లకుపైగానే బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తంలో పంచాయతీలకు రూ.11 కోట్లు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌కు రూ.24 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తంలో ఒక్క నెల్లూరు నగర పాలక సంస్థకే రూ.12 కోట్లకు పైబడి ఉంది. ఈ డీటీకి సంబంధించి ఎంత మొత్తం చెల్లించాలనే వివరాలు జిల్లా రిజిస్ట్రార్లు పంచాయతీల వారీగా తెలియ చేయాలి. అప్పుడు జిల్లా రిజిస్ట్రార్ ఆ వివరాలు ట్రెజరీకి పంపుతారు. ట్రెజరీ ద్వారా స్థానిక సంస్థలకు నగదు విడుదలవు తుంది. కానీ సబ్ రిజిస్ట్రార్లు తమ పరిధిలోని పంచాయతీల వారీ గా టీడీ వివరాలు పంపడంలో తాత్సారం చేస్తున్నట్లు తెలుస్తోంది.

బార్లకు దరఖాస్తులు నిల్!

● ముందుకు రాని వ్యాపారులు

నెల్లూరు (క్రైం), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నూతన బార్ పాలసీని బార్ల యజమానులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలోనే జిల్లాలో 50 బార్లకు సంబంధించి ఒక్క దరఖాస్తు కూడా ఎక్సైజ్ అధికారులకు అందలేదు. ఈ నెల 18వ తేదీన కలెక్టర్ ఆనంద్ గజిట్‌ను విడుదల చేయగా, దరఖాస్తుల దాఖలుకు ఈ నెల 26 వరకు గడువు ఉంది. అయితే, నాలుగు రోజులు గడిచినా ఒక దరఖాస్తు కూడా అందలేదు. కాగా, నూతన పాలసీపై బార్ల నిర్వాహకులు ఇటీవల సమావేశమై తమ నిర్ణయాలను ఎక్సైజ్ అధికారులను కలిసి విన్నవించారు. నూతన పాలసీపై యజమానుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, తమ ఆర్థిక భద్రతపై, వ్యాపార స్థిరత్వంపై ప్రతికూల ప్రభావం చూపుతూందని వ్యాపారులు పేర్కొన్నారు. నెలకు రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లుతుందని, జరగబోయే బార్ టెండర్లలో తాము పాల్గొనడం లేదని తేల్చి చెప్పారు. లాటరీ విధానం ప్రవేశపెట్టడం ద్వారా సుదీర్ఘకాలంగా ఉన్న బార్ యజమానులకు లైసెన్సులు పోగొట్టుకునే ప్రమాదం ఉందని తెలిపారు. తదితర అంశాలపై అధికారులకు విన్నవించుకోగా, పాలసీని మార్చే అధికారం తమ చేతుల్లో లేదని, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను మాత్రమే తాము అమలు చేస్తామని స్పష్టం చేశారు. బార్లకు దరఖాస్తు చేసుకునేందుకు ఐదు రోజులు మాత్రమే గడువు ఉండటంతో ఎన్ని దరఖాస్తులు అందుతాయో వేచి చూడాలి.

నెల్లూరు బీసీ ల్యాబ్‌కు జాతీయస్థాయి గుర్తింపు

నెల్లూరు (వ్యవసాయం): నెల్లూరులోని జీవన ఎరువులు, సేంద్రీయ ఎరువుల నాణ్యత నిర్ధారణ ప్రయోగశాల (బీసీ ల్యాబ్)కు నేషనల్ అక్రెడిటేషన్ బోర్డ్ ఆఫ్ టెస్టింగ్ అండ్ కొలాబ్రేషన్ లేబరేటరీస్ (ఎన్ఏబీఎల్) జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. 2016లో రాష్ట్రంలోనే మొదటిదిగా ఈబీసీ ల్యాబ్ ప్రారంభమైంది. ఇందులో రైజోబియం, అజస్పిరిల్లం, అజుటోబాక్టర్ వంటి జీవన ఎరువులతోపాటు కంపోస్టు, వర్మికంపోస్టు, భాస్వరంతో కూడిన సేంద్రీయ ఎరువు, ద్రవ రూపంలోని పార్టిఫైడ్ సేంద్రీయ ఎరువులు, ఇంకా వేప, ఆముదం, కానుగ, జట్రోఫా, మాహువాలను ఎఫ్‌సీఓ 1985 ప్రకారం నిర్ధారణ చేస్తారు. రైతులకు నాణ్యమైన జీవన, సేంద్రీయ ఎరువులను అందించి తద్వారా సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే ప్రధాన ఉద్దేశమని జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీసీ ల్యాబ్‌లో పనిచేస్తున్న అధికారులను, సిబ్బందిని ఆమె అభినందించారు.



సిమెంట్ రోడ్డు మార్జిన్‌కు ట్రాక్టర్‌తో తోలిన తువ్వ ఇసుక

ఇది సురక్షితమేనా!?

● సీసీ రోడ్ల మార్జిన్లకు తువ్వ ఇసుక
● ప్రమాదమని తెలిసినా ఓ కాంట్రాక్టర్ కక్కుర్తి

ఇది ఓ కాంట్రాక్టర్ కక్కుర్తి. సిమెంటు రోడ్డుకు ఇరువైపులా మట్టి బదులు తువ్వ ఇసుకతో నింపుతున్నాడు. భవిష్యత్తులో అది నిలవదని తెలిసినా అధికారులు కూడా మిన్నకుండిపోతున్నారు. సంగం మండలం మక్తాపురంలో ఇటీవల సిమెంట్ రోడ్లకు రూ.45 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయి. అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు కాంట్రాక్టర్‌గా అవతారమెత్తి రూ.10 లక్షలలోపు బిట్లుగా విభజించి నామినేషన్‌పై పనులు చేపట్టారు. గ్రామం నడిబొడ్డున ఈశ్వరమ్మ రాయి నుంచి ఎస్టీ కాలనీ వరకు, వాటర్ ప్లాంట్ నుంచి పోలేరమ్మ గుడి వరకు సుమారు 1350 మీటర్ల పొడవున సిమెంట్ రోడ్డు వేశారు. అయితే రోడ్డు మార్జిన్‌కు గ్రావెల్ తోలాల్సి ఉండగా సమీపంలోని పెన్నానది ఒడ్డున లభ్యమయ్యే తువ్వ ఇసుకతో నింపుతున్నారు. ఈ తువ్వ ఇసుక తోలితో ట్రాక్టర్ రూ.500లే ఖర్చు అవుతుంది. అదే ట్రాక్టర్ గ్రావెల్‌కు సుమారు రూ.3000 నుంచి 3500 వేలు ఖర్చవుతుంది. తవ్వ ఇసుక తోలడం వల్ల సదరు నాయకుడికి ఒక ట్రాక్టర్‌కు సుమారు రూ.2500 నుంచి 3000 ఆదా అవుతుంది. దీంతో ఆ నాయకుడు అర కిలోమీటరు దూరంలో పెన్నాలో నుంచి తువ్వ ఇసుక వేసి చేతులు దులుపుకుంటున్నాడు. ఇది వేయడం వల్ల ఇసుక కోతకు గురై యథావిధిగా మారుతుంది. అంతేగాక ఇసుక వల్ల వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్, పంచాయతీరాజ్ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. మరోవైపు సీసీ రోడ్డు నిర్మాణంలోనూ నాణ్యత లోపించిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్ అధికారులు తనిఖీ చేయాలని కోరుతున్నారు. ఈఆర్ ఏఈ రామయ్య మాట్లాడుతూ రోడ్డు మార్జిన్‌కు వేసిన తువ్వ ఇసుకను తొలగించి గ్రావెల్ తోలాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. రోడ్డు నాణ్యతపై క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేశాకే బిల్లులు అందజేస్తామని చెప్పారు.

- సంగం, (ఆంధ్రజ్యోతి)

ఓరా.. సౌర!

● విస్తరిస్తున్న సోలార్ విద్యుత్ వినియోగం
● కార్యాలయాలు, ఇళ్లపై విస్తృతంగా పలకల ఏర్పాటు



నారాయణ మెడికల్ కాలేజీ భవనంపై..



జడ్పీ కార్యాలయంలోని పార్కింగ్‌లో..



కార్పొరేషన్ కార్యాలయంపై..

సోలార్ విద్యుత్ వినియోగంపై ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. మొన్నటిదాకా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలపైనే సోలార్ పలకలు ఏర్పాటు చేశారు. అయితే, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విరివిగా సబ్సిడీలు ఇవ్వడంతో ప్రజలు కూడా సోలార్ ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. పలకల ఏర్పాటుతో మిద్దెలన్నీ అద్దంలా మెరిసిపోతున్నాయి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి, నెల్లూరు)



ఓ వాణిజ్య సముదాయం ముందు..

హెచ్‌ఐవీపై అవగాహన

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని ఎస్‌కేఆర్‌ఎస్, డీఎల్‌ఎస్‌ఆర్ విద్యాసంస్థల్లో గురువారం చైల్డ్ ఫండ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సంస్థ ప్రతినిధులు వివరించారు. లింక్ వర్కర్ ఇతాంబ, ప్రధానోపాధ్యాయురాలు ఇందిర, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9507
వెండి కిలో ధర	రూ. 116300
వెండి ఒక గ్రాము	రూ. 119.30



60 రకాల వైద్య పరీక్షలు

డాక్టర్ ప్రవల్లిక, వైద్యాధికారిణి, కసుమూరు పీహెచ్‌సీ

వెంకటాచలం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కసుమూరు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో 60 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని కసుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఎస్ ప్రవల్లిక తెలిపారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు.

?. పీహెచ్‌సీకి రోజుకు ఎంతమంది రోగులు వస్తున్నారు

!. రోజుకు సుమారు 60 నుంచి 80 మంది రోగులు వైద్యం కోసం వస్తున్నారు.

?. జ్వరపీడితులకు ఎలాంటి వైద్య సేవలు అందిస్తున్నారు

!. జ్వర బాధితులకు పీహెచ్‌సీలో అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తున్నాం. జ్వరమొస్తే వెంటనే ఆస్పత్రికి రావాలని అవగాహన కల్పిస్తున్నాం.

?. ఎలాంటి వ్యాధులతో ఎక్కువగా ఆసుపత్రికి వస్తున్నారు

!. చిన్న పిల్లలు జ్వరం, నెమ్ము, జలుబు, దగ్గు, పెద్దవారు బీపీ, షుగర్, కీళ్ల నొప్పులతో ఎక్కువమంది చికిత్స కోసం ఆసుపత్రికి వస్తున్నారు.

?. వ్యాధుల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు సూచిస్తున్నారు

!. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. పౌష్టికాహారం తీసుకుంటూ, పరిశుభ్రత పాటిస్తే వ్యాధుల బారినపడకుండా ఉంటారు.

స్వమిత్వ సర్వేపై శిక్షణ

మనుబోలు, ఆగస్టు 21: ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు స్వమిత్వ సర్వే నిర్వహిస్తున్నారు. దీనిపై గురువారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సర్వేపై విలేజ్ సర్వేయర్ శిక్షణ ఇచ్చారు. సర్వే ఏవిధంగా చేయాలి? ఎలా కొలతలు తీయాలి? వాటిని ఆన్‌లైన్‌లో ఏవిధంగా నమోదు చేయాలి? దేని ప్రామాణికంగా సర్వే హద్దులు తీసుకోవాలన్న అంశాలపై అవగాహన కల్పించారు. త్వరలో గ్రామ కంఠాలలో ఇళ్లు వేసుకున్నవారికి హక్కు పత్రాలు (ప్రాపర్టీ కార్డులు) ఇవ్వనున్న నేపథ్యంలో ఈ శిక్షణ ఇస్తున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో నారాయణ తెలిపారు.

అదానీ కళాశాలకు రహదారి ఏర్పాటు



స్థలాన్ని పరిశీలిస్తున్న మల్లికార్జునయాదవ్

ముత్తుకూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ముత్తుకూరులోని సీవీఆర్ మధురానగర్‌లో నిర్మిస్తున్న అదానీ కళాశాల కోసం ప్రత్యేక రహదారిని ఏర్పాటు చేస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్ తెలిపారు. మధురానగర్ మత్స్యకార కాపులతో కలిసి ఆయన గురువారం రహదారి కోసం స్థలాన్ని పరిశీలించారు. కళాశాలకు వెళ్లే వాహనాలు వల్ల గ్రామస్తులకు ఇబ్బంది లేకుండా ఔటర్ సర్కిల్‌లో రహదారిని నిర్మించనున్నారన్నారు. సాయిబాబా మందిరం ఎదురుగా కాలువ పక్క నుంచి కళాశాల వరకు, అక్కడి నుంచి మధురానగర్, బీసీ కాలనీకి వెళ్లే రహదారిలో కలుస్తుందన్నారు. కళాశాల రహదారి నుంచి శాంతినగర్ వరకు పొడిగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార కాపులు ఈశ్వరయ్య, శివ, టీడీపీ నాయకులు గుంజి శ్రీనివాసులు, శివకృష్ణ పాల్గొన్నారు.

పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

ఆత్మకూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొత్తం 4861 మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నామని, ఇటీవల నిర్వహించన పరిశీలనలో 90 మందికి రద్దయ్యాయని ఎంపీడీవో పి రఫీఖాన్ తెలిపారు. అయితే రద్దయిన 90 వికలాంగుల పింఛన్లల్లో 46 వృద్ధాప్య పెన్షన్లుగా మార్పిడి చేశారన్నారు. ఇక మిగిలిన 44 మందికి పింఛన్లు రద్దయ్యాయని, వారిలో అర్హులు ఉంటే తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుతో పాటు వారి ఆధార్‌కార్డు, సదరన్ సర్టిఫికెట్, రద్దు పరచబడిన నోటీసును జతచేసి మండల పరిషత్ కార్యాలయంలో ఇవ్వాలని తెలిపారు.

డేంజర్.. యమ డేంజర్!

గోతులు తీశారు.. వదిలేశారు!

పొంచి ఉన్న ప్రమాదాలు..

ఆందోళనలో ప్రజలు



ఖాజానగర్ వీధిలో పూడ్చకుండా వదిలేసిన గోతులు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో అమృత్ 2 ఓ పథకంలో భాగంగా ప్రతి ఇంటికీ ఉచిత కొళాయి ఏర్పాటు కోసం నాలుగు నెలల కిందట గోతులు తీశారు. కానీ ఇంత వరకూ వాటిని పూడ్చడం మరిచారు. దీంతో ఆయా ప్రాంతాల్లో గోతులు ప్రమాదకరంగా మారాయి. కాశీ పాళెం, బేల్దారిపాళెం, రామకృష్ణానగర్, ఖాజానగర్ తదితర ప్రాంతాల్లో కాంట్రాక్టర్లు గోతులు తీసి పైపులైన్లు వేశారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్డు పగలగొట్టిన రబ్బీస్‌నే గోతుల్లో వేసి పైపైన పూడ్చారు. కొన్ని రోజులకే ఆ గోతులు కుంగిపోయాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో పిల్లలు, వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రిళ్ల పరిస్థితి ఇంకా ప్రమాదకరంగా మారింది.

మసీదు పక్క వీధిలో... ప్రమాదకరంగా...

పవ్వేరు బ్యాంకు వద్ద మసీదు పక్క వీధిలో రెండు నెలల క్రితం పైపులైన్ కోసం తీసిన గోతులను నేటికీ పూడ్చకపోవడంతో ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకున్నాయని ప్రజలు వాపోతున్నారు. పైపులైన్లు పూర్తిగా పూడ్చాలంటే కొత్తగా వేసిన పైపులైన్లు షింక్ చేసి ఆ తరువాత ఇళ్లకు కొళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి వుంది. పట్టణంలో అసలే రోడ్లు వెడల్పు తక్కువ. దీనికి తోడు పైపులైన్ల కోసం తవ్విన గోతులను తూతూ మంత్రంగా పూడ్చి వదిలేయడంతో ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. నెలరోజులుగా పూడ్చివేత పనులను కూడా ఆపేశారు. ఇప్పటికైనా గోతులను పూర్తిగా మట్టితో పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

రబ్బీస్‌తో గోతులు పూడ్చారు..



రోడ్లు పగలగొట్టేశారు. రోడ్డు రబ్బీస్‌తోనే గోతులు పూడ్చారు. దీంతో రోడ్లన్నీ గుంత లమయంగా మారాయి. పిల్లలు, పెద్దలు, వాహనాల్లో వెళ్ళేవారు గోతుల్లో పడి ప్రమాదాలకు గురౌతున్నారు. కాంట్రాక్టర్లు, నగర పంచాయతీ వాళ్లు ఎవ్వ రూ పట్టించుకోవడం లేదు.

- రహమత, ఖాజానగర్, బుచ్చిరెడ్డిపాళెం

గోతిలోకి కారు దిగబడింది..



రెండు నెలల క్రితం పైపులైన్ల కోసం గోతులు తీశారు. తరువాత పైపులైను వేసి సగం పూడ్చి వదిలేశారు. ఈ గోతు లు ప్రమాదకరంగా మారాయి. ఇటీవల గోతిలోకి కారు దిగబడింది. రాత్రిళ్ల ఈ రోడ్లపై వెళ్లాలంటే ఇంకా భయంగా ఉంది. మా ఇబ్బందులను ఎవరూ పట్టించుకోవడంలేదు.

- సుల్తాన్ బాషా, ఖాజానగర్

పింఛన్ ఇప్పించి ఆదుకోండి!

- దివ్యాంగుడి వినతి



వినతిపత్రం అందిస్తున్న షబ్బీర్

ఉదయగిరి రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పింఛనే జీవనాధారంగా బతుకుతున్న తనకు పింఛను రద్దు చేస్తున్నట్లు నోటీసులు అందించడం ఎంతవరకు సమంజసమని వెంగళరావు నగర్ గ్రామానికి చెందిన షేక్ షబ్బీర్ అనే దివ్యాంగుడు ఆవేదన వ్యక్తంచేశాడు. గురువారం స్థానిక సచివాలయానికి వెళ్లి తన వద్ద ఉన్న ఆధారాలను వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లికార్జునకు అందించి పింఛను ఇప్పించి ఆదుకోవాలని వేడుకున్నాడు. వెల్ఫేర్ అసిస్టెంట్ మాట్లాడుతూ సచివాలయ పరిధిలోని వెంగళరావునగర్‌లో 11, గండిపాళెంలో మరో 9 పింఛన్లను రద్దుచేస్తున్నట్లు నోటీసులు అందించడం జరిగిందన్నారు. వాటిల్లో అర్హత ఉన్నవారు మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు

- ఖాళీ స్థలం వదలకుంటే ఇబ్బందులు
- అనధికారిక లే అవుట్లను అరికట్టాలి
- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వేదికపై జేసీ కార్తీక్, నుడా చైర్మన్ కోటంరెడ్డి

వెంకటాచలం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన లే అవుట్ల రెగ్యులరైజేషన్ జీవో పట్ల పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వ్యవహరిస్తే చర్యలు తప్పవని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హెచ్చరించారు. వెంకటాచలంలో గురువారం సాయంత్రం నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, నుడా వీసీ కార్తీక్‌లతో కలిసి ఆయన తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమావేశాన్ని నిర్వహించారు. లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్)లో భాగంగా అనధికార లే అవుట్లు, ప్లాట్లకు చట్టబద్ధత కల్పించేలా అధికారులు, సిబ్బంది కలిసి బాధ్యతగా పని చేయాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి సూచించారు. సర్వేపల్లి నియోజకవర్గంలోనే 1400 ఎకరాలలో 138 అనధికార లే అవుట్లు వేశారన్నారు. లే అవుట్లలో కనీసం 10 శాతం కూడా ఓపెన్ స్పేస్ వదలకుంటే భావితరాలకు ఇబ్బందులు తప్పవన్నారు. ఖచ్చితంగా ఓపెన్ స్పేస్ వదిలేలా చర్యలు తీసుకోవాలన్నారు. మనుబోలు, బండేపల్లి, జట్లకొండూరు, మడమనూరు, కంటేపల్లిలలో భూములను ఆక్రమించుకుని రికార్డులను తరుమారు చేశారన్నారు. రికార్డులు మార్చేసింది పెద్దోళ్లేనన్నారు. భూములను గుర్తించి స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైసీపీ హయాంలోనే అనధికార లేఅవుట్లు కూడా ఏర్పడ్డాయని, భూముల రికార్డులు కూడా మార్చేశారన్నారు. ఆ భూములు గుర్తించి స్వాధీనం చేసుకుంటే పరిశ్రమల కేంద్రానికి, అవసరమైతే పేదల ఇళ్ల స్థలాలకు కేటాయిస్తామన్నారు. సీఎస్‌ఆర్ ఫండ్స్‌లో సర్వేపల్లి అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. వెంకటాచలం, పొదలకూరు సీహెచ్‌సీలను సీఎస్‌ఆర్ నిధులతో మరింత అభివృద్ధి చేశామన్నారు. త్వరలో సీఎస్‌ఆర్ నిధులతో పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సర్వేపల్లి అభివృద్ధికి నుడా సహకారం అవసరమన్నారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలోనే వందలాది అక్రమ లే అవుట్లు వెలిశాయన్నారు. నిర్ణీత వ్యవధి దాటిన తర్వాత అప్పటికీ క్రమబద్ధీకరించుకోకపోతే అక్రమ లేఅవుట్లను తొలగిస్తామని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులను గట్టిగా నిలదీస్తే అబద్ధాలు చెప్పి తప్పించుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో నుడా వీసీ, జాయింట్ కలెక్టర్ కార్తీక్, డ్వామా పీడీ గంగా భవానీ తదితరులు పాల్గొన్నారు.

రూ. 26 వేల వేతనం ఇవ్వాలని ఆందోళన



మనుబోలులో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మనుబోలు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తమకు ప్రభుత్వ ఉద్యోగులు వలె రూ.26 వేలు జీతం ఇవ్వాలంటూ గురువారం మనుబోలులో అంగన్‌వాడీలు ఆటో సెంటర్‌లో సీఐటియూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మండల అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు శేషమ్మ మాట్లాడుతూ ప్రతి పనికీ యాప్‌లు పెట్టి అందులో నమోదు చేయాలంటున్నారు. అలాంటప్పుడు 5జీ ఫోన్‌లు ఇస్తే అవి బాగా పనిచేస్తాయన్నారు. పాతఫోన్లు ఇచ్చి, అవిపనిచేయక వాటితో సమయం వృధా అవుతోందన్నారు. అందుకనే వాటిని తిరిగి ఇచ్చేసామన్నారు. పక్క రాష్ట్రంలో అంగన్‌వాడీలకు ప్రభుత్వం ఎక్కువ జీతాలు ఇస్తోందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇతర ఉద్యోగుల వలె గ్రాట్యూటీ, ఆపదలో ఆర్థిక సాయం ఇవ్వాలన్నారు. అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు వచ్చేలా చేయాలన్నారు. ఇప్పటివరకు ఇచ్చిన ఏ ఒక్క పథకం కార్యకర్తలకు దక్కలేదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి సుగుణ, సీపీఎం కార్యదర్శి తలారి దేవదానం, సీఐటీయూ కార్యదర్శి ఆదిశేషయ్యలు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: ఎఫ్‌ఆర్‌ఎస్ విధానం వల్ల అంగన్‌వాడీ కార్మికుల మీద పనిభారం పడుతుందని అంగన్‌వాడీ జిల్లా నాయకురాలు ఎల్‌వీ శేషమ్మ అన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం బుచ్చిరెడ్డిపాళెం పార్కు సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వేతనాల పెంపుతోపాటు, పలు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మల్లికార్జున, షేక్ జానీబాషా, అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు, కార్యకర్తలు అనిత, కుసుమ, అమరసేన, స్వర్ణ, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

నేతలకు ఎమ్మెల్యే సోమిరెడ్డి పరామర్శ

పొదలకూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు నేతలను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గురువారం పరామర్శించారు. విరువూరులో ఎద్దల ప్రసాద్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. మహ్మదాపురం టీడీపీ కార్యకర్త ఎండీ ఇర్షాద్ ఇటీవల గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. పొదలకూరులో మైనార్టీ సెల్ నేత షేక్ జమీర్‌బాషా కోడలు ఇటీవల మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లి కార్జున్ నాయుడు, కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి, జమీర్‌బాషా, ఖాదర్ బాషా, ఎద్దుల అజయ్ పాల్గొన్నారు.

వాడవాడలా ప్రతాప్ దిష్టిబొమ్మల దహనం

కావలి,ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిపై హత్యాయత్నాన్ని నిరసిస్తూ, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిని అరెస్ట్ చేయాలని టీడీపీ శ్రేణలు గురువారం వాడవాడలా ప్రతాప్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కొన్ని ప్రాంతాల్లో ప్రతాప్‌రెడ్డి బొమ్మలతో నిరసన తెలిపారు. పాతూరులోని క్రిష్టుడి బొమ్మ సెంటర్, 31వ వార్డులో జనతాపేటలోని పెద్దపవని రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద, ముసునూరు సెంటర్‌లో ని ట్రంకు రోడ్డులో, 8వ వార్డులోని వివేకానంద పార్కు ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. 26, 29 వార్డులకు చెందిన టీడీపీ శ్రేణులు ఉదయగిరి రోడ్డులో ప్రతాప్‌రెడ్డి చిత్రపటంతో నిరసన తెలిపారు.

విలువలతో కూడిన విద్యనందించాలి

ఉదయగిరి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్రమ శిక్షణ, విలువలతో కూడిన విద్యనందించాలని ఎంఈవోలు తిప్పరెడ్డి వెంకటేశ్వర్లు, తోట శ్రీనివాసులు ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం పట్టణంలోని యాదవపాళెం, మెయిన్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు.

'స్మార్ట్'గా లేకపోతే సైబర్ దాడి ఖాయం!

- క్లిక్ చేస్తే ఖాతా ఖాళీ
- ఆశ పడితే అంతే సంగతి!
- జాగ్రత్తే తగిన రక్షణ



ముత్తుకూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : డిజిటల్ యుగంలో ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్, ప్రతి పనిలోనూ ఆన్‌లైన్ ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. అయితే స్మార్ట్‌గా వ్యవహరించని వారిని సైబర్ నేరగాళ్లు వలలో చిక్కేస్తున్నారు. క్లిక్ చేస్తే ఖాతాలో ఉన్న డబ్బులు ఖాళీ అవుతున్నాయి. ఒక్క క్లిక్‌తోనే జీవితపు పొదుపులు నిమిషాల్లో మాయమవుతున్నాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. మభ్యపెట్టే లింకులు పంపించం, నకిలీ బ్యాంకు కాల్స్ చేయడం వంటి విధానాలతో ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారు. ఓటీపీ అడగడం, ఆకర్షణీయమైన ఆఫర్లు చూపడం ద్వారా వల వేస్తున్నారు. ఫేస్‌బుక్, వాట్సప్ గ్రూపుల్లో బహుమతులు గెలిచారని చెప్పి మోసం చేస్తున్నారు. నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి డబ్బు లాగేస్తున్నారు. కొత్తగా యూపీఐ చెల్లింపుల పేరుతోనూ మోసాలు పెరుగుతున్నాయి. ప్రజల నిర్లక్ష్యమే సైబర్ దాడులు చేసే ఆగంతకులకు ఆయుధంగా మారుతోంది. బ్యాంకులు ఎప్పుడు ఓటీపీ లేదా పిన్ అడగవని చెబుతున్నా ప్రజలు మోసపోతున్నారు. బ్యాంకు నుంచి నిజంగానే కాల్ వచ్చిందేమోనని నమ్మేస్తున్నారు. ఆఫర్ల ఆశతో లింకులు క్లిక్ చేసి ఖాతాలు కోల్పోతున్నారు. తెలియని యాప్‌లు డౌన్‌లోడ్ చేయడం, అనుమానాస్పద వెబ్‌సైట్లు తెరవడం ప్రమాదకరంగా మారుతోంది. సైబర్ మోసాల విషయంలో నగదు అపహరణ క్షణాల్లోనే కన్నుమూసి తెరిచేలోగా జరిగిపోతోంది. ఒకసారి వివరాలు దొరికాక ఖాతాలోని మొత్తాన్ని నిమిషాల్లో ఖాళీ చేస్తున్నారు. నగదు విదేశీ ఖాతాలను మళ్లించడంతో తిరిగి పొందడం కష్టమవుతోంది. రోజూ రూ.కోట్లలో మోసపోతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. స్మార్ట్ ఫోన్ విషయంలో చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద నష్టానికి దారి తీస్తుంది. అధికారిక వెబ్‌సైట్‌లోనే లావాదేవీలు చేయాలి. అపరిచితుల మాటలు నమ్మరాదని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు.

● ఫిర్యాదు చేస్తేనే రక్షణ...

సైబర్ మోసాలకు గురైన వెంటనే ఫిర్యాదు చేస్తేనే ఫలితం ఉంటుంది. ప్రతి జిల్లా కేంద్రంలో సైబర్ క్రైమ్ సెల్ పనిచేస్తుంది. మోసం జరిగితే వెంటనే ఫిర్యాదు చేస్తేనే డబ్బు తిరిగి వచ్చే అవకాశం ఉంది. ముందు జాగ్ర త్తే సరైన రక్షణ అని పోలీసులు స్పష్టం చేశారు. డిజిటల్ సౌలభ్యం ఎంత ఉంటే, మోసపోవడానికి అంతే అవకాశ మూ ఉంది. స్మార్ట్ ఫోన్ వాడుతున్నంత వరకు స్మార్ట్‌గా వ్యవహరించాలి. లేదంటే సైబర్ దాడులకు బలి కావాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

● ఈ జాగ్రత్తలు పాటిస్తే సేఫ్..

- బ్యాంకులు ఓటీపీ, పిన్ అడగవని గుర్తుంచుకోండి.
- అనుమానాస్పద లింకులు క్లిక్ చేయవద్దు.
- నకిలీ కస్టమర్ కేర్ నంబర్లతో జాగ్రత్తగా ఉండాలి.
- పెద్ద మొత్తాల లావాదేవీలకు టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ వాడండి.
- 1930 హెల్ప్‌లైన్‌కు వెంటనే కాల్ చేయండి
- సైబర్‌క్రైమ్.జీవో.ఇన్ లో ఫిర్యాదు చేయండి.
- పాస్‌వర్డ్‌లు తరచూ మార్చండి
- పబ్లిక్ వైఫైలో బ్యాంకింగ్ చేయవద్దు.
- సోషల్‌మీడియాలో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దు.

C.R.I.M.E N.E.W.S

స్టీల్ తరలింపు ఇంటి దొంగ పనే!

- అధికారులు, పోలీసుల ఎదుట అంగీకరించిన ఏఈ



ముళ్లపొదల్లో ఉన్న స్టీల్

దుత్తలూరు(ఉదయగిరి), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టపగలే దుత్తలూరు గృహ నిర్మాణ శాఖ గోదాము చి బుధవారం స్టీల్ (ఇనుప చువ్వ)ను తరలిస్తుండగా పోలీసులు వెంటాడి పట్టు కున్న విషయం తెలిసిందే. కాగా, ఆ ఇనుమును అక్రమంగా తలించింది అక్ర మార్కులు కాదు.. సాక్షాత్తూ ఆ శాఖ ఉదయగిరి ఏఈ రామకృష్ణ అని రుజువైంది. అధికారులు రంగప్రవేశం చేయడంతో ఇనుమును తానే తరలించానని, పొరపాటైందని, ఇకమీదట ఇలాంటి పనులు చేయనంటూ బుధవారం రామకృష్ణ అధికారులు, పోలీసులకు లిఖితపూర్వకంగా అందజేశారు.

ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం

నారాయణరెడ్డి, ఈఈ, గృహ నిర్మాణ శాఖ

దుత్తలూరు గృహ నిర్మాణ శాఖ గోదాము నుంచి అక్రమంగా స్టీల్ తరలింపు ఘటనపై ఉన్నతాధికారులకు నివేదికం పంపాం. స్టీల్ తరలించిది తానేనని ఏఈ రామకృష్ణ ఒప్పుకుని లిఖితపూర్వకంగా అందజేశారని ఆయన తెలిపారు.

ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా పట్టలేడు

ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా పట్టలేరన్న చందంగా తయారైంది గృహ నిర్మాణ శాఖ అధికారుల పనితీరు. ఎవరైనా ఫిర్యాదు చేస్తేనో, సమాచారం అందిస్తేనో తప్ప వారి అసలు బండారం బయట పడట్లేదు. జిల్లాలో యథేచ్ఛగా స్టీల్, సిమెంట్ అక్రమంగా తరలించి సొమ్ము చేసుకోవడం వారికి పరిపాటిగా మారింది. అందుకు ఉదాహరణే బుధవారం దుత్తలూరు హౌసింగ్ గోదాము నుంచి ఆ శాఖ ఏఈ అక్రమంగా వాహనంలో స్టీల్ తరలించడం. దుత్తలూరు ఏఈ యప్రాయం ఈఏడాది ఏప్రిల్, మే మాసాల్లో సెలవు పెట్టడంతో ఉన్నతాధికారులు రామకృష్ణకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆసమయంలో సైతం గోదాము నుంచి నాలుగైదు సార్లు స్టీల్ అక్ర మంగా తరలించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ అను మానంతోనే అక్కడ పనిచేస్తున్న హౌసింగ్ సిబ్బంది గోదాముపై ప్రత్యే క నిఘా ఉంచడంతో ఈ అక్రమ స్టీల్ తరలింపు వ్యవహారం బట్టబ యలైందని పలువురు చర్చించుకుంటున్నారు. దీనికితోడు లబ్ధిదారు లకు అందజేయాల్సిన సిమెంట్ సైతం అధికారుల నిర్లక్ష్యం కారణంగా గోదాములో గడ్డకట్టిపోయింది. ఎలాంటి రక్షణ లేకుండా స్టీల్ గోదాము ఆరుబయట ముళ్లచెట్లలో పడేశారు. దీంతో ఆ శాఖ అధికారే దానిని గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య



శివకుమార్‌రెడ్డి మృతదేహం

కోవూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక గుమ్మళ్లదిబ్బ కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ కలికి శివకుమార్ రెడ్డి (49) గురువారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇనమడుగు రోడ్డు కూడలికి సమీపంలోని పొలంలో మృతదేహాన్ని స్థానిక రైతులు గుర్తిం చి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నట్లు ఎస్‌ఐ రంగనాథ్ గౌడ్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

11 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్



పోలీసులు అదుపులో ఉన్న పేకాటరాయుళ్లు

ఆత్మకూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని నారంపేట సమీపంలోని పంట పొ లాల్లో పేకాట స్థావరా లపై సీఐ జి గంగాధర్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం దాడి చేసి 11 మంది పేకాటరాయుళ్ల ను అరెస్ట్ చేశారు. వారి వద్ద ఉన్న రూ. 5,10,000 నగదును, మోటారు బైక్‌ను స్వాధీనపరుచుకున్నారు. కేసు నమోదు చేసి పేకాటరాయుళ్ల ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ గంగాధర్ మాట్లాడుతూ పేకట స్థావరాలు, గంజాయి విక్రయాలు తదితర అ సాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. గ్రామాల్లో అసాంఘీక కార్యక్రమాలు జరుగుతుంటే పోలీసులకు సమా చారం అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు, అనంతసాగరం, సంగం, ఏఎస్‌పేట ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మోటారు బైకు, బొలెరో ఢీ

- ఒకరికి తీవ్ర గాయాలు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 21 (ఆంధ్ర జ్యోతి): ఎదురెదురుగా వస్తున్న మోటారుబైకు, బొలెరో వాహనం ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం బోగ్యంవారిపల్లి బస్టాండ్ సెంటర్‌లోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాల మేరకు.. తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన దేవరపు మాలకొండయ్య అనే వ్యక్తి పొలం నుంచి పశువుల మేతను మోటారుబైకుపై తీసుకెళ్తున్నాడు. అదే క్రమంలో ప్రకాశం జిల్లా మార్టూరు నుంచి ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం మోటారుబైకును ఢీకొంది. దీంతో మోటారు బైకు బోల్తా పడడంతో మాలకొండయ్యకు తీవ్ర గాయాల య్యాయి. దీంతో చికిత్స నిమిత్తం ప్రకాశం జిల్లా పామూరుకు తరలిం చారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

వెంకటాచలం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : తిక్కవ రప్పాడు రోడ్డులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సర్వేపల్లి గ్రామానికి చెందిన తెనాలి శేఖర్ బైక్‌పై సర్వేపల్లి నుంచి వెంకటాచలం వైపు వెళ్తుండగా రాంగ్ రూటులో వచ్చిన ఆయిల్ ట్యాంకర్ బైక్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ శేఖర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసు లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోవూరు ఎమ్మెల్యేకి బెదిరింపు లేఖ..

ఒకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి బెదిరింపు లేఖ రాసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ నెల 17వ తేదీ గుర్తుతెలియని వ్యక్తి నెల్లూరులోని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నివాసానికి వచ్చి భద్రత సిబ్బందికి ఓ లేఖ ఇచ్చి వెళ్లాడు. ప్రజలు వారి సమస్యలు పరిష్కరించమని అర్జీలు ఇస్తున్నట్లుగా భావించిన భద్రత సిబ్బంది ఆ లేఖను కార్యాలయ సిబ్బందికి అందించారు. లేఖను పరిశీ లించగా ప్రశాంతిరెడ్డి రూ. 2 కోట్లు ఇవ్వాలని, లేకుంటే చం పేస్తామని రాసి ఉంది. సిబ్బంది వెంటనే విషయాన్ని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి తెలిపారు.పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. అల్లూరు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి లేఖ రాసినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. గూగుల్, యూట్యూబ్‌లో శోధించి లేఖ రాసినట్లు నిందితుడు తెలిపినట్లు సమాచారం. అయితే పోలీసులు అదుపులోకి తీసుకున్న వ్యక్తికి గతంలో ఎలాంటి నేర చరిత్ర లేదని, కేసులు లేవని తెలిసింది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	108
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	224

కోడిగుడ్ల ధర (100): 525

జర్నలిస్టు కాలనీలో స్థలాల ఆక్రమణ ?

● కాలనీకి సంబంధం లేదన్న వీఆర్వో

నెల్లూరు రూరల్, ఆగస్టు 21,(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్లోని కొత్తూరు వద్ద ప్రభుత్వం జర్నలిస్టులకు పంపిణీ చేసిన ఇంటి స్థలాల ఆక్రమణ యత్నం జరిగింది. గురువారం ఎక్స్‌కవేటర్‌తో చెట్లను తొలగించి స్థలాలు చదును చేస్తున్నారన్న సమాచారంతో కొందరు జర్నలిస్టులు అక్క డికి చేరుకున్నారు. తమకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాలను ఎలా ఆక్రమిస్తా రని ప్రశ్నించారు. కాగా, ఈ విషయమై అక్కడున్న వీఆర్వో రమణయ్యను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా జర్నలిస్టు కాలనీ జోలికి ఎవరూ వెళ్లలేదని, కాలనీకి ఆనుకుని 2010లో గుండ్లపాళెం కాలువ కట్టపై నివాసముండే పేదలకు 9 అంకణాల చొప్పున ప్రభుత్వ స్థలాలు కేటాయించిందని చెప్పా రు. వాటికి పొజిషన్ చూపించాలని తాజాగా హైకోర్టు ఆదేశించడంతో తాము వచ్చామని తెలిపారు.

న్యూస్ బాక్స్



దివ్యాంగ పింఛన్లు అనర్హులవే తొలగిస్తాం

● నెల్లూరు రూరల్ ఎంపీడీవో శైలేంద్రకుమార్

నెల్లూరు రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల పింఛన్ల రీ వెరిఫికేషన్ ప్రక్రియలో జాబితా నుంచి అనర్హులనే తొలగిస్తామని, అర్హత కలిగిన వారు ఆందోళన చెందాల్సిన పని లేదని నెల్లూరు రూరల్ ఎంపీడీవో శైలేంద్ర కుమార్ తెలిపారు. ఆంధ్రజ్యోతికి ఆయన తెలిపిన విషయాలు ఆయన మాటల్లోనే....

? దివ్యాంగుల పింఛన్ల తొలగింపు నిజమేనా...

! దివ్యాంగుల పింఛన్లపై పరిశీలన జరుగుతోంది. అర్హత ఉన్నవారి పరిస్థితి, వైకల్యం పరిశీలన బృందాలకు కనిపిస్తుంది. అర్హత లేనివారే ఏరివేతకు గురవుతారు.

? గ్రామ సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండటం లేదంట..

! ఇప్పట్లో సచివాలయానికి రాకుండా ఉండటం కుదరదు. ముఖ హాజరు తప్పనిసరి. సచివాలయానికి వచ్చి ఆపై సిబ్బందంతా క్షేత్రస్థాయి సర్వేలకు వెళ్తున్నారు. అనేక రకాల సర్వేలు చేయాల్సిన అవసరం ఉంది. అందువల్ల అందుబాటులో లేరనుకుంటున్నారు.

? పంచాయతీ కార్యదర్శులు కూడా ప్రజలకు అందుబాటులో ఉండటం లేదన్న విమర్శలున్నాయి. మీరేమంటారు.

! నెల్లూరు రూరల్ మండలంలోని గొల్లకందుకూరు, కొత్తవెల్లంటి గ్రామాల కార్యదర్శులు డిప్యుటేషన్‌పై బయట ఉన్నారు. వారిని వెనక్కు రమ్మని కోరాం. ఆ రెండు పంచాయతీలు మినహాయిస్తే మిగిలిన పంచాయ తీలకు కార్యదర్శులున్నారు. వారంతా నిత్యం గ్రామాలకు వెళ్తున్నారు. అక్కడ్నుంచే నాతో మాట్లాడుతున్నారు.

? గ్రామాల్లో పారిశుధ్య లేమి బాగా కనిపిస్తోంది. పరిష్కార చర్యలు ఏమిటి.

! దీనిపై ఈ రోజే మండల, గ్రామాల అధికారులతో సమీక్ష నిర్వహించా. పల్లెల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని ఆదేశించా. ఆకస్మిక తనిఖీలుంటాయి. లోపాలు కనిపిస్తే బాధ్యులపై చర్యలుంటాయి.

అర్బన్ బ్యాంకు చైర్మన్‌కు అభినందనలు



అరిగెల నాగేంద్ర సాయి

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ అరిగెల నాగేంద్ర సాయి ఇటీవల భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) జిల్లా సమితి కార్యదర్శిగా నియమితుల య్యారు. ఆ పార్టీ నగర కార్యదర్శిగా ఉన్న ఆయనకు జిల్లా కార్యదర్శిగా పదోన్నతి లభించింది. ఆయన చైర్మన్‌గా అర్బన్ బ్యాంకును అభివృద్ధి పథం లో నడుపుతున్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా ఆయనకు బ్యాంకు సీఈవో అనిత, డైరెక్టర్లు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

'పార్వతమ్మకు సహకరిస్తాం'

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విశ్వబ్రాహ్మణ అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కమ్మరి పార్వతమ్మకు సంపూర్ణ సహకారం అందిస్తామని జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఖాజన వెంకట శేషయ్య ఆచారి తెలిపారు. గురువారం విజయవాడలోని బీసీ భవన్‌లో జరిగిన పార్వతమ్మ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన జిల్లా నుంచి పలువురు నాయకులతో కలిసి హాజరయ్యారు. పార్వతమ్మను సత్కరించారు. విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

ఫ్లెక్సీలమయం!!

నెల్లూరు నగరంలో ఎక్కడ చూసినా ఫ్లెక్సీలే!. ప్రచార పిచ్చి పరాకాష్టకు చేరడంతో వీరు.. వారు అని లేకుండా అందరూ ఎక్కడపడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. వీధుల్లో చిన్నవి, ఓ మోస్తరు ఫ్లెక్సీలు, ప్రధాన కూడళ్లలో భారీ ఫ్లెక్సీలు, డివైడర్లపై పెద్ద సంఖ్యలో బోర్డులు దర్శనమిస్తున్నారు. వీటిలో అత్యధికం రాజకీయ నాయకులవే కావడం గమనార్హం. ఆ తర్వాత వాణిజ్య ప్రకటనలు ఉంటున్నాయి. కొందరు యువకులు, సామాన్యులు సైతం పుట్టిన రోజు శుభాకాంక్షలంటూ ఎవరికి వారు పెద్దపెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. ఇలాంటివి నగరవాసులకు తీవ్ర అసౌకర్యం, ట్రాఫిక్ ఇబ్బందులు కలిగిస్తున్నాయి. నగరాన్ని ఫ్లెక్సీలు, పోస్టర్ల రహితంగా మారుస్తామంటూ కొన్ని నెలల క్రితం కార్యాచరణకు పూనుకున్న కార్పొరేషన్, ఆ తర్వాత చేతులెత్తేసింది. నియంత్రణ లేకపోవడంతో ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు ఫ్లెక్సీలు కట్టేస్తున్నారు.

● నగరం నిండా ఫ్లెక్సీలు
● ప్రచార పిచ్చితో విచ్చలవిడిగా ఏర్పాటు
● రాజకీయ నాయకులవే అధికం
● ఆపై వాణిజ్య సంస్థలవి...
● ప్రతీ కార్యక్రమానికి భారీగా ఏర్పాటు
● నియంత్రణపై చేతులెత్తేసిన కార్పొరేషన్



నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు



నెల్లూరు(సిటీ), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరాన్ని ఫ్లెక్సీలు, పోస్టర్ల రహితంగా తీర్చిదిద్దుతామంటూ కార్పొరే షన్ యంత్రాంగం కొన్ని నెలల క్రితం తెగ హడావిడి చేసింది. కనిపించిన ఫ్లెక్సీలు, పోస్టర్లను సిబ్బంది పీకేశారు. ఏకంగా అగ్ని మాపక దళాన్ని రంగంలోకి దింపి నీళ్లతో తడిపిమరీ పోస్టర్లను తొలగించారు. అయితే ఇదంతా తాటాకు మంటలాగ చల్లారిపోయింది. ఫ్లెక్సీల నియంత్రణ విషయంలో అధికారులు కొన్నిరోజులకే చేతులెత్తేశారు. దీంతో ఇప్పుడు నగరంలో ఎక్కడ చూసినా ఫ్లెక్సీలు, పోస్టర్లే దర్శనమిస్తున్నాయి. ఫ్లెక్సీల్లో ఎక్కువగా రాజకీయ నాయకులవే ఉండటంతో వాటిని తొలగించేందుకు అధికారులు సాహసించలేక పోతున్నారు.

● **మూడునాళ్ల ముచ్చటే..**

ప్లాస్టిక్ ఉత్పత్తులను నిలువరించి, పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చిన పురపాలక శాఖ ఫ్లెక్సీలు, పోస్టర్ల వాడకాన్ని నివారించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ రంగంలోకి దిగారు. నెల్లూరు పర్యటనకు వచ్చినప్పుడల్లా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కనిపించిన ఫ్లెక్సీలు, పోస్టర్లను తానే స్వయంగా తొలగించారు. ఈ తంతు ఇలాగే కొనసాగుతుందని ప్రకటించారు. అధికారులు ఫ్లెక్సీలు, పోస్టర్ల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వకూడదని, అనుమతుల్లేని వాటిని పీకేయాలని ఆదేశించారు. కానీ ఈ హడావిడిని కార్పొరేషన్ అధికారులు కొన్ని రోజులు చేపట్టి ఆపై వదిలేశారు. ప్రస్తుతం నగరంలోని ప్రధాన కూడళ్లు, రహదారులు, వీధులు, కాంప్లెక్సులతోపాటు శివారు ప్రాంతాలలో నూ ఫ్లెక్సీల ఏర్పాటు మితిమీరిపోయింది.

● **రాజకీయ పార్టీలవి కావడంతో....**

నగరంలో దర్శనమిచ్చే ఫ్లెక్సీలలో సింహభాగం రాజకీయ పార్టీలకు చెందినవి కావడంతో కార్పొరేషన్ అధికారులు వాటిని తొలగించేందుకు అడుగు ముందుకు వేయలేకపోతున్నారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నేతలు, నాయకులతో కూడిన ఫ్లెక్సీలను ఆయా ప్రాంతా ల కార్యకర్తలు వేస్తున్నారు. వీటిని తొలగించేందుకు ఎన్ఎంసీకి చెందిన ఏ ఒక్క అధికారి కూడా సాహసించడం లేదు. అవి అలాగే రోజుల తరబడి దర్శనమిస్తున్నాయి. ఇక ప్రైవేట్ కార్యక్రమాలు, సినీ హీరోల అభిమానులు వేసిన ఫ్లెక్సీల జోలికి కూడా అధికారులెవ్వరు వెళ్లపోవడం గమనార్హం. మొత్తం మీద ఫ్లెక్సీల ఏర్పాటును నిలువరించి, పర్యావరణాన్ని కాపాడాలన్న పురపాలక శాఖ ఆదేశాలు అటకెక్కినట్లు స్పష్టమవుతోంది.

● **కట్టడి చేయకపోతే ముప్పు**

ప్లాస్టిక్ ముడిపదార్థంతో తయారయ్యే ఫ్లెక్సీలు, పోస్టర్లు పర్యావరణానికి పెనుముప్పని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటిల్లో ఫొటోలు అందంగా కనిపించినప్పటికీ వాటి వెనుక భవిష్యత్ తరాలకు చేటు చేసే అనేక రసాయనాలున్నాయని హెచ్చరిస్తున్నారు. ఒకసారి వేసి పడేసిన ఫ్లెక్సీలు భూమిలో కరిగిపోక అలాగే ఉండి కాలుష్య కారకంగా మారుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. వీటిల్లో వాడే రంగుల వల్ల చర్మ వ్యాధులు, క్యాన్సర్ వంటి రోగాలు ప్రబలుతాయని హెచ్చరిస్తున్నారు. పైగా ఎక్కడ పడితే అక్కడ పెద్ద పెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. కొన్ని చోట్ల ఫ్లెక్సీల ఏర్పాటుకు రోడ్లు కూడా తవ్వేస్తున్నారు. ఇప్పుడిప్పుడే బాగుపడుతున్న రహదారులను ఇలా తవ్వడం వల్ల నగర వీధులు మళ్లీ అధ్వానంగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో నగరాన్ని ఫ్లెక్సీ రహితంగా మార్చాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఫ్లెక్సీల వల్ల అనర్థం

ఫ్లెక్సీలు, పోస్టర్ల వల్ల అనేక అనార్థాలున్నాయి. వాటిని పూర్తిగా నిలువరిస్తే తప్ప పర్యావరణానికి మేలు జరగదు. ప్లాస్టిక్ నియంత్రణలో భాగంగా వీటిని కట్టనివ్వకుండా కఠినంగా చర్యలు తీసుకోవాలి.

\- సందాని బాషా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పర్యావరణాన్ని కాపాడుకోవడం ఏ ఒక్కరివల్లో అయ్యే పనికాదు. అందరు కలిసి కృషి చేస్తేనే సాధ్యమవుతుంది. పాలకపక్షం ఒక నిర్ణయం తీసుకున్నప్పుడు దానిని యంత్రాంగం కఠినంగా అమలు జరపాలి. అప్పుడే ఆశించిన ఫలితం దక్కుతుంది.

\- లీలామోహన్

విధుల్లో అలసత్వంపై చర్యలు

పారిశుధ్య సిబ్బందికి జీతం నిలుపుదల



కాలువలో పేరుకున్న వ్యర్థాలను పరిశీలిస్తున్న ఎంహెచ్‌వో

నెల్లూరు(సిటీ), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : విధుల్లో అలసత్వం వహిస్తున్న పలు డివిజన్లలోని పారిశుధ్య సిబ్బందిపై ఎంహెచ్‌వో కనకాద్రి చర్యలకు ఆదేశించారు. 7వ డివిజన్‌లో విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హమీద్ అనే కార్మికుడి జీతం ఆపాలని అధికారులకు సూచించారు. 24వ డివిజన్‌లో శ్రీకాంత్ అనే వర్కురు ముందస్తు సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరవడంపై మండిపడ్డారు. ఆయన జీతాన్ని కూడా నిలుపుదల చేయాలని ఆదేశించారు. 53వ డివిజన్ వెంకటేశ్వరపురంలో మేకల వెంకట రమణయ్య అనే కార్మికుడు కొన్ని రోజులుగా విధులకు హాజరవడంలేదని స్థానిక పారిశుధ్య కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదుతో మెమో జారీ చేసి వివరణ కోరాలని ఎంహెచ్‌వో సూచించారు. అనంతరం 53, 54 డివిజన్లలో పారిశుధ్య ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కాలువల్లో పూడికతీత పనులు వేగంగా చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. కాగా, కార్పొరేషన్ ఎస్ఈ రామ్మోహన్‌రావు గిడ్డంగివీధి, కంసాలి వీధి, కుక్కలగుంట ప్రాంతాల్లో పర్యటించారు. వీధి కొళాయిలకు మరమ్మతులు చేయాలని స్థానిక సిబ్బందిని ఆదేశించారు.

ప్రియుడి వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సహజీవనం చేస్తున్న వ్యక్తి వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని వైఎస్ఆర్ నగర్‌లో శివలక్ష్మి(34), ఆమె కుమార్తె యక్షిత నివసిస్తున్నారు. శివలక్ష్మి భర్త వెంకట సుబ్బారావు ఏడేళ్ల క్రితం కుటుంబ కలహాలతో భార్య, కుమార్తెను విడిచి వెళ్లిపోయాడు. నాలుగేళ్ల క్రితం సింగరాయకొండ బింగినపల్లి గ్రామంలో నివాసం ఉంటూ నెల్లూరు సెంట్రల్ జైలులో వార్డన్‌గా పనిచేస్తున్న శివకుమార్‌కు శివలక్ష్మితో పరిచయం ఏర్పడింది. బాగా చూసుకుంటానని, అండగా ఉంటానని నమ్మించడంతో శివలక్ష్మి అతనితో సహజీవనం చేయడం ప్రారంభించింది. ప్రస్తుతం వారికి పది నెలల బాబు ఉన్నాడు. అయితే కొంత కాలంగా శివకుమార్ తనను నిర్లక్ష్యం చేస్తున్నాడంటూ ఇటీవల శివలక్ష్మి గట్టిగా ప్రశ్నించింది. దీంతో తనకు భార్య, పిల్లలు ఉన్నారని, నిన్ను పోషించలేనంటూ శివలక్ష్మిని అతను కొట్టడం, తిట్టడం ప్రారంభించాడు. ఈ క్రమంలో ఈ నెల 20వ తేదీ ఇద్దరి మధ్య వివాదం జరిగింది. అదేరోజు రాత్రి శివలక్ష్మి బెడ్ రూమ్‌లోకి వెళ్లి తలుపులు వేసుకుంది. కుమార్తె యక్షిత వెళ్లి తట్టినా తీయలేదు. విషయాన్ని శివకుమార్‌కు తెలియజేయడంతో ఇద్దరు కలిసి బెడ్‌రూమ్ తలుపులు గట్టిగా నెట్టగా లోపల శివలక్ష్మి చీరకు వేలాడుతూ కన్పించింది. హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే శివలక్ష్మి మృతి చెందిందని నిర్ధారించారు. దీనిపై కుమార్తె యక్షిత గురువారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. శివకుమార్ వేధింపులే తల్లి మృతికి కారణమని ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీ టాక్స్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా కోట సునీల్



నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : ఏపీ టాక్స్‌బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా కోట సునీల్‌కుమార్ నియమితుల య్యారు. గురువారం ఆ అసోసియేషన్ వర్చువల్‌గా నిర్వహించిన వార్షిక సర్వసభ్య సమావేశంలో గూడూరుకు చెందిన న్యాయవాది, సీనియర్ ఆడిటర్ అయిన కోట సునీల్ కుమార్‌ను ఉపాధ్యక్షుడిగా ప్రకటించారు. సునీల్‌కు పలువురు చార్టెడ్ అకౌంటెంట్లు, ఆడిటర్లు అభినందనలు తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలి

● మాజీ డిప్యూటీ మేయర్ మాదాల



సదస్సులో మాట్లాడుతున్న మాదాల వెంకటేశ్వర్లు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నగర మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. నగరంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నెల్లూరు రూరల్ మహాసభ గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాదాల మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో 17 రోజుల సమ్మె సందర్భంగా మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాల న్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు పెంచల నర్సయ్య మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం కార్మికులంతా ఏకతాటిపైకి వచ్చి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం 57 మందితో నూతన కమిటీ ఎన్నికయ్యింది. ఈ కార్యక్రమంలో సీపీఎం నెల్లూరు నగర, రూరల్ కార్యదర్శులు కత్తి శ్రీనివాసులు, కొండా ప్రసాద్, సీఐటీయూ నాయకులు సుధాకర్, నాగేశ్వరరెడ్డి, సూర్యనారాయణ, శివాజీ, మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెలాఖరుకు ఉత్తర కాలువ పనులు

● అక్టోబరు నుంచి రాళ్లపాడుకు నీరు ● నెరవేరనున్న రైతుల కల



రాళ్లపాడు ఉత్తర కాలువ వెడల్పు పనులు చేస్తున్న యంత్రాలు



ఉత్తర కాలువపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం

లింగసముద్రం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నుంచి రాళ్లపాడు ప్రాజెక్టుకు నీరందించే ఉత్తర కాలువ వెడల్పు పనులు వేగంగా జరుగుతున్నాయి. వచ్చే నెలాఖరుకు ఈ పనులు పూర్తవుతాయని, అక్టోబరు మొదటివారం నుంచి రాళ్లపాడుకు నీరు వచ్చే అవకాశం ఉందని ప్రాజెక్టు ఈఈ మునిరత్నం, డీఈలు శేషయ్య, వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉత్తర కాలువ వెడల్పు పనులు 89 కి.మీ నుంచి 95వ కి.మీ మధ్య జరుగుతున్నాయి. కాలువపై అక్కడక్కడా వంతెనల నిర్మాణం కూడా జరుగుతున్నది. గతంలో 150 క్యూసెక్కుల నీటిని మాత్రమే సరఫరా చేసేలా కాలువ వెడల్పు 3.7 మీటర్లు మాత్రమే ఉండేది. అయితే రాళ్లపాడుకు 600 క్యూసెక్కుల నీటిని అందించేలా కాలువను 10 మీటర్ల వెడల్పు చేస్తున్నారు. ఈ పనులు పూర్తయ్యాక సోమశిల నుంచి 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారు. ఎన్నో ఏళ్ల నుంచి సోమశిల జలాల కోసం ఎదురుచూస్తున్న రైతుల కల ఎట్టకేలకు అక్టోబరులో నెరవేరనున్నది.

అక్రమ కేసులు బనాయిస్తున్నారు : వైసీపీ

నెల్లూరు(క్రైం), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి జైల్లో పెడుతోందని వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు మండిపడ్డారు. దీనిపై గురువారం ఎస్పీ కార్యాలయంలో డీఎస్పీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లా పర్యటనకు వచ్చిన జగన్మోహన్‌రెడ్డిని కలిసేందుకు తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నాయకులు చెబుతున్న వైసీపీ నేతలపై మాత్రమే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతుల అభివృద్ధికి కృషి : బీజేపీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సంచార, అర్ధ సంచార జాతుల అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం విజయవాడలో సంచార జాతుల విముక్తి దినోత్సవం నిర్వహించనున్నారని తెలిపారు. బీజేపీ నాయకులు, సంచార జాతుల పెద్దలు, కళాకారులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. విలేకర్ల సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకసిరి ఫణిరాజు, రాష్ట్ర నాయకుడు కోసూరు బాలయ్య పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు

● వైద్య సిబ్బందిపై డీసీహెచ్‌ఎస్‌ల ఆగ్రహం



వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఒంగోలు, నెల్లూరు డీసీహెచ్‌ఎస్‌లు శ్రీనివాస నాయక్, పరిమిళ

ఉలవపాడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీహెచ్‌సీ వైద్యుల పనితీరు అసంతృప్తిగా ఉందని, తీరు మార్చుకోకుంటే శాఖాపర మైన చర్యలు తప్పవని డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ హాస్పిటల్స్ సర్వీసెస్(డీసీహెచ్ఎస్) ఒంగోలు, నెల్లూరుకు చెందిన అధికారులు శ్రీనివాస్ నాయక్, పరిమిళ హెచ్చరించారు. గురువారం వారిద్దరూ ఉలవపాడు సీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో 8 మంది వైద్యులు విధులు నిర్వహించాల్సి ఉండగా, ముగ్గురు మాత్రమే ఉన్నారు. అదే సమయంలో స్థానికులు సీహెచ్‌సీ వైద్య సేవలపై ఫిర్యాదులు చేశా రు. పేరుకే 30 పడకల ఆసుపత్రి అయినా ఏరోజు కూడా పూర్తిస్థాయిలో వైద్యులు విధుల్లో ఉం డరని, ఒకరో ఇద్దరో డ్యూటీలో వచ్చిన రోగులకు నామమాత్రంగా సేవలు అందిస్తున్నారని ఫిర్యా దు చేశారు. గైనకాలజిస్టు, జనరల్ మెడిసిన్ వైద్యులు, జనరల్ సర్జన్, బీపీ, షుగర్ వైద్యులు సెలవుల్లో ఉన్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు. చి న్నపిల్లల వైద్యులు, డెంటల్, మత్తుడాక్టర్ మాత్ర మే గురువారం విధుల్లో ఉన్నారని పేర్కొన్నారు. అంతేకాక మధ్యాహ్నం, రాత్రులు డ్యూటీ డాక్టర్లు ఉండటం లేదన్నారు. వైద్య సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ పనితీరు మార్చుకో కపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. శిథిలావస్థలో ఉన్న పాత ఆసుపత్రి భవనం తొలగించే ఏర్పాట్లు చేస్తామని వారు స్థానికులకు హామీ ఇచ్చారు.

దీప్తి నర్సింగ్ హోంలో అరుదైన శస్త్రచికిత్స

● వైద్యులు లోకనాథం, సుమతి

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మహిళల్లో అరుదుగా వచ్చే ఫైబ్రాయిడ్ గడ్డను లాప్రోస్కోపి శస్త్రచికిత్స ద్వారా విజయవంతంగా తొలగించినట్లు నగరంలోని దీప్తి నర్సింగ్ హోం వైద్య నిపుణులు డాక్టర్ లోకనాథం, డాక్టర్ సుమతి వెల్లడించారు. నర్సింగ్ హోంలో గురువారం వారు మీడియాతో మాట్లాడారు. జిల్లాలోని దగదర్తి మండలానికి చెందిన అశ్విని (28) కొన్ని రోజులుగా తీవ్ర రక్తస్రా వం, అతి మూత్ర విసర్జన, వాంతులతో బాధపడుతూ తమ వద్దకు వచ్చిందని చెప్పారు. వైద్య పరీక్షలు నిర్వహించి గర్భసంచిలో 25 సెంటిమీటర్ల గడ్డ ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. శస్త్రచికిత్స చేసి ఆ గడ్డను తొలగించినట్లు పేర్కొన్నారు.

ఇవి నీళ్ల ట్యాంకులేనండి!

జిహ్వకో రుచి.. పుర్రెకో బుద్ధి.. నిజమేగా! చేతికి ఉండే ఐదు వేళ్లే సమానంగా ఉండవు. అలాంటిది.. సమాజంలో ఉన్న కోట్లాదిమంది మెదళ్లలో కోటి వెరైటీ ఐడియాలు ఉండడంలో పెద్దగా హా..శ్చర్యమేమీ లేదు కదా. డిఫరెంట్‌గా ఆలోచించే వ్యక్తులను చూస్తే ఎవరికైనా ముచ్చటేస్తుంది. ఎంతమందిలో ఉన్నా.. ఇలాంటివారి రూటే సపరేట్! ఎంతో అందంగా నిర్మించికున్న ఇంటిపై నీళ్ల ట్యాంకులను తమ అభిరుచులకు అనుగుణంగా నిర్మించుకున్నారు. చూపరులను ఇవి ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

మేడ ఎక్కిన కారు!



పొదలకూరులోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఉంటున్న దుగ్గినేని వెంకటేశ్వర్లు తన ఇంటిపై కారు ఆకారంలో నీళ్ల ట్యాంకును నిర్మించుకున్నాడు. రాపూరు, గూడూరు మార్గంలో పొయ్యే వాళ్లందరూ.. 'కారెట్ల మేడె క్కిందబ్బా..' అని తలపైకెత్తి అదే పనిగా చూస్తాంటారు. కానీ.. అది వాటర్ ట్యాంక్. అని తెలుసుకుని.. 'వార్నీ.. పాసుగులా.. ఎంకటేశన్నకు బొలే ఐడియా వచ్చినాదే' అని నవ్వుకుంటూ వెళుతున్నారు.

– పొదలకూరు (ఆంధ్రజ్యోతి)

పూరిల్లు ఆకృతిలో..



ఇది పూరిల్లు ఆకారంలో నిర్మించిన భవనం అనుకుంటే తప్పులో కాలేసినట్లే. వాస్తవానికి సంగంలోని మెయిన్ బజార్‌లో ఉన్న రహీం తన మూడంతస్తుల మిద్దెపైన పూరిల్లు ఆకృతిలో వాటర్ ట్యాంకును నిర్మించారు. ఇది చూసేందుకు ఎంతో ఆకర్షణీయంగా ఉంది.

– సంగం, (ఆంధ్రజ్యోతి)

ఫొటోగ్రఫీపై ప్రేమతో ఇలా...



ఫొటోగ్రఫీపై ఉన్న ప్రేమతో ఇంటిపై కెమెరా ఆకృతిలో వాటర్ ట్యాంక్ నిర్మించాడు రాపూరుకి చెందిన శేషు. గత ముప్పై ఏళ్లుగా పట్టణంలో శేషు స్టూడియో పేరుతో ఆయన ఫొటో స్టూడియో నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో 2010లో ఇంటి నిర్మాణం చేపట్టి మిద్దెపైన కెమెరా ఆకృతిలో వాటర్ ట్యాంక్ నిర్మించారు. చూపరులను ఇది ఎంతగానో ఆకట్టుకుంటున్నది. ఈ నిర్మాణం శేషు వృత్తి నిబద్ధతకు అద్దం పట్టేలా ఉంది.

– రాపూరు, (ఆంధ్రజ్యోతి)

చిన శేషవాహనంపై చిద్విలాసుడు

వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు



గొలగమూడిలో వెలసిన అవధూత వెంకయ్యస్వామి 43వ ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం వేకువజామున గోపూజ తో నిత్య పూజలు మొదలయ్యాయి. అనంతరం సుప్రభాత సేవ, అభిషేకం, హారతి, ప్రసాద వినియోగం, ఉత్సవ విగ్రహానికి అభిషేకం, సహస్రనామార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు ఆశ్రమ ఈవో బాల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో చినశేష వాహన సేవ నిర్వహించారు. రాత్రికి గజవాహన సేవ నేత్ర పర్వంగా జరిగింది. సేవలను తిలకించడానికి భక్తులు తండోపతండాలుగా వచ్చారు. దివిటీలు, విద్యుద్దీపాల కాంతుల మధ్య వెంకయ్య స్వామి మరింత శోభాయమానంగా భక్తులకు దర్శనమిచ్చారు. ఊరేగింపు సందర్భంగా వివిధ వాద్యాలు భక్తి పారవశ్యాన్ని పంచాయి. వెంకయ్య స్వామి వారికి గ్రామ స్తులు కర్పూర నీరాజనాలు అందించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శుక్రవారం ఉదయం వెంకయ్య స్వామికి అశ్వవాహన సేవ, రాత్రికి పెదశేషవాహన సేవ నిర్వహిస్తామని ఈవో బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.

– వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి)

చీకటి పడితే చేయి పట్టరా..!

- రాత్రుళ్లు పని చేయని పీహెచ్‌సీలు
- నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఆసుపత్రులు
- నైట్‌డ్యూటీ చేయని కొందరు స్టాఫ్‌నర్సులు
- అత్యవసర స్థితిలో రోగులకు అవస్థలు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పీహెచ్‌సీ) చీకటి పడితే సేవలు అందించడం లేదు. పీహెచ్‌సీలు పగలే కాకుండా రాత్రుళ్లు కూడా తెరచి ఉంచాలని, అత్యవసర రోగులకు ప్రాథమిక వైద్య సేవలు అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశించాయి. ఇందుకోసం ఆరోగ్య కేంద్రాల్లో రాత్రుళ్లు విధులు నిర్వహించేందుకు స్టాఫ్ నర్సులను కూడా నియమించాయి. ప్రతి రోజూ మూడు షిఫ్టుల్లో స్టాఫ్‌నర్సులు అందుబాటులో ఉండాలి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు, రాత్రి 8 నుంచి ఉదయం 8 గంటల వరకు వారు సేవలు అందించాల్సి ఉంటుంది. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం ఒక్కో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ముగ్గురు స్టాఫ్‌నర్సులను నియమించింది. అయితే జిల్లాలో కొన్ని పీహెచ్‌సీలను చీకటిపడగానే మూస్తేస్తున్నారు. దీనివల్ల రాత్రి పూట అనారోగ్యం, అత్యవసర వైద్యం కోసం వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. విధిలేని పరిస్థితిలో బాధితులు ప్రైవేట్ ఆసుపత్రికి వెళుతున్నారు.



రాత్రి 8గంటల ప్రాంతంలో మూసి ఉన్న అల్లీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



జగదేవిపేట పీహెచ్‌సీకి తాళం

పనిచేస్తేగా...!?

జిల్లా వ్యాప్తంగా 52 పీహెచ్‌సీలున్నాయి. వాటిలో కొన్నింటిని సోమవారం ఆంధ్రజ్యోతి పరిశీలించింది. జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరానికి కూతవేటు దూరంలో అల్లీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాత్రి 8.10 గంటలకు వెళ్లగా ఆ ఆసుపత్రి బయట అన్ని లైట్లు వేసి ఆసుపత్రికి మాత్రం తాళాలు వేసుకుని వెళ్లారు. ఇక్కడ ఇద్దరు వైద్యులు ఉండాలి. వారి పర్యవేక్షణ లేకపోవటంతో రాత్రి విధులు నిర్వహించాల్సిన స్టాఫ్‌నర్సు కూడా విధులకు డుమ్మా కొట్టారు. ఆ సమయంలో తీవ్ర గాయాలైన 30 ఏళ్ల వ్యక్తిని అత్యవసర చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకువచ్చారు. పీహెచ్‌సీ మూసివేసి ఉండటంతో అత్యవసరంగా ఆటోలో నెల్లూరులోని రామచంద్రారెడ్డి ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్‌నర్సు విధుల్లో ఉండి ఉంటే కనీసం ప్రాథమిక వైద్యం అందించి ఉండేది. అల్లీపురం పీహెచ్‌సీ సర్వేపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి నివాసానికి దగ్గరలోనే ఉంటుంది. ఆ వైద్యశాల కోసం సోమిరెడ్డి కోట్ల రూపాయల విలువైన స్థలం కేటాయించటమే కాకుండా ప్రత్యేకంగా పర్యవేక్షిస్తుంటారు కూడా. అలాంటి చోటే రోజంతా వైద్య సేవలు అందకపోవడం గమనార్హం.

● ఇందుకూరుపేట మండలం జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిస్థితి కూడా ఇలాగే ఉంది. రాత్రి 8.30 గంటలకు ఈ ఆసుపత్రిని పరిశీలించగా మూసి ఉంది. ఆసుపత్రిలో రాత్రుళ్లు నర్సులు సక్రమంగా అందుబాటులో ఉండరని, ఇలాంటి వారికి ప్రభుత్వం జీతాలు ఎందుకిస్తోందంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరానికి అతి దగ్గరగా ఉండే పీహెచ్‌సీల్లోనే సేవలు ఇలా ఉంటే ఇక మారుమూల పల్లెల్లో ఆరోగ్య కేంద్రాల పనితీరు ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

చర్యలు తీసుకుంటాం



జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తెల్లవార్లు తెరిచి ఉండాలి. ప్రత్యే కించి రాత్రి పూట ఓ స్టాఫ్‌నర్సు ఉండాలి. ఇందుకోసం నియామకాలు చేప ట్టాము. అయితే కొన్ని పీహెచ్‌సీల్లో స్టాఫ్‌నర్సులు లేక మూసి వేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అలాంటి కేంద్రాల సిబ్బందిపై చర్యలు తీసుకుం టాం. ఆరోగ్య కేంద్రాలపై వైద్యుల పర్యవేక్షణ ఉండేలా చూస్తాం.

– డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో

అధికారుల పర్యవేక్షణ ఏదీ?

ఆరోగ్య కేంద్రాలు ప్రజలు సక్రమంగా సేవలు అందించేలా వైద్యాధికారులు తరచూ తనిఖీ చేయాలి. గ్రామీణులతో మాట్లాడి ఆసుపత్రి పనితీరును తెలుసుకోవాలి. ప్రత్యేకించి ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో అధికారులు పర్యటించి ఆసుపత్రి అందిస్తున్న వైద్య చికిత్సలపై ఆరా తీయాలి. అయితే పలువురు అధికారులు పీహెచ్‌సీల పర్యవేక్షణను పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఆరోగ్య కేంద్రాల సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.



కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లించండి

● కలెక్టర్ ఆనంద్‌కు వ్యవసాయ కార్మిక సంఘం వినతి

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జాతీయ రహదారి కోసం భూములు కోల్పోతున్న రైతులకు మెరుగైన నష్టపరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం కలెక్టర్ ఆనంద్‌కు నాయకులు వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా కార్యదర్శి మంగలం పుల్లయ్య మాట్లాడుతూ భారతమాల పేరుతో జిల్లాలో 108 కిలోమీటర్ల జాతీయ రహదారి నిర్మాణం జరుగుతోందన్నారు. ఇందుకోసం ఆరు మండలాల్లోని 38 గ్రామాల్లో 980 ఎకరాల భూసేకరణ జరుగుతోందని తెలియచేశారు. ఈ క్రమంలో భూములు కోల్పోతున్న రైతులకు నామమాత్రంగా నష్టపరిహారం చెల్లిస్తున్నారని ఆరోపించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం బహిరంగ మార్కెట్ విలువకు మూడింతలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు, ఆదిశేషయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభం



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

నెల్లూరు(విద్య), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గురువారం అండర్-15 రాష్ట్ర సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి 300 జట్లు ఈ పోటీల్లో తలపడనున్నాయి. క్రీడాకారులకు ఎటువంటి అసౌర్యం కలుగకుండా ఏర్పాట్లు చేసినట్టు రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ తెలిపారు.

జీఎస్టీ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్



జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించామని వాణిజ్యపన్నుల శాఖ నెల్లూరు డివిజన్ జాయింట్ కమిషనర్ వై కిరణ్ కుమార్ చెప్పారు. జాయింట్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన గురువారం ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. నెల్లూరు డివిజన్ పరిధిలో నెల్లూరు, ప్రకాశం జిల్లాలు ఉన్నాయని, వ్యాపారస్తులంతా వారి జీఎస్టీ రిటర్నులు సకాలంలో క్రమం తప్పకుండా దాఖలు చేసే విధంగా పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు. డివిజన్ ఆదాయాన్ని పెంచేందుకు రిటర్నులు దాఖలు చేయని వారిని, టీడీఎస్ మినహాయించబడిన వర్క్స్ కాంట్రాక్టర్లతో జీఎస్టీ చెల్లించే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. వృత్తి పన్ను చెల్లింపుదారులు సకాలంలో ఆ పన్ను చెల్లించాలని కోరారు.

ఏ గ్రేడ్ అవార్డులకు గ్రామాలు పోటీపడాలి

- ప్రభుత్వం సూచించిన విధంగా మౌలిక సదుపాయాలు కల్పించండి
- జడ్పీ సీఈవో మోహన్‌రావు, డీపీవో శ్రీధర్‌రెడ్డి



అవార్డులు అందుకున్న జడ్పీ ఉద్యోగులతో చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈవో మోహన్‌రావు, డీపీవో శ్రీధర్‌రెడ్డి తదితరులు

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ పంచాయతీలు ఏ గ్రేడ్, ఏ ప్లస్ గ్రేడ్ అవార్డులకు పోటీపడేలా పల్లెలను తీర్చిదిద్దాలని అధికారులను జిల్లాపరిషత్ సీఈవో మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి ఆదేశించారు. పంచాయతీల పురోగతిపై జిల్లా పరిషత్ కార్యాలయంలో గురు వారం ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, ఎంసీవోల కు శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ హాజరై తరగతులను ప్రారంభించారు. సీఈవో, డీపీవో మాట్లాడుతూ 2022 నుంచి పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. పంచాయతీలకు కేంద్రం అవార్డులు ప్రకటిస్తుందని తెలిపారు. 2022-23 సంవత్సరానికిగాను జిల్లా నుంచి ఎక్కువగా డీ గ్రేడ్‌కు పంచాయతీలు ఎన్నికయ్యాయని చెప్పారు. ఈ పరిస్థితిని అధిగమించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించిందని తెలిపారు. 2023-24 కుగాను పంచాయతీలు ఏ గ్రేడ్, ఏ ప్లస్ గ్రేడ్‌లకు పోటీపడాలని ప్రభుత్వం ప్రత్యేక విధి, విధానాలను రూపొందించిందన్నారు. అందుకు అనుగుణంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు, మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. పంచాయతీల పనితీరుకు సంబంధించిన అంశాలు ప్రత్యేక ఫోల్డర్‌లో పొందుపరిచి, దేశంలోనే అవార్డులు పొందడంలో ప్రథమంగా నిలిచేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. దీనికోసం ఎంపీడీవోలంతా గ్రామ స్థాయి అధి కారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిం చాలని ఆదేశించారు.

అవార్డుల పంపిణీ

జడ్పీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అవార్డులు ప్రకటించారు. జిల్లా పరి షత్‌లో 31మందికి అవార్డులు ప్రకటించగా, సమయాభావం వల్ల ఆగస్టు 15న జరిగిన వేడుకలో ఐదుగురికే ప్రశంసాపత్రాలు అందజేశారు. మిగిలిన 26మందికి జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈవో మోహన్‌రావు గురువారం అవార్డులను అందజేశారు.

వైభవంగా పోలేరమ్మ తిరుణాళ్ల

- భక్తిశ్రద్ధలతో పొంగళ్లు
- ఉత్సాహంగా బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలను తిలకిస్తున్న ప్రజలు



విశేష పుష్పాలంకరణలో పోలేరమ్మ

కలిగిరి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలంపాడులో ఐదురోజులుగా జరుగుతున్న పోలేరమ్మ తిరుణాళ్ల గురువారం వైభవంగా ముగిసింది. చివరిరోజు ఆలయం వద్ద కొండ తొమ్మిది గ్రామాలకు చెందిన మహిళలు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. విశేష పుష్పాలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయంలో జరిగిన ప్రత్యేక అభిషేకాలు, పూజల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రైతులు తమ ఎడ్లబండ్లను, ట్రాక్టర్లను అందంగా అలంకరించుకొని ఆలయం చుట్టూ కుటుంబసభ్యులతో ప్రదక్షిణలు చేశారు. ఆలయం వద్ద సాయంత్రం నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో లెనిన్ ఎంటర్‌ప్రైజెస్, పొట్టేపాలెం-నెల్లూరు రూరల్ (ప్రథమ), పల్లెబోయిన కృష్ణ తేజరెడ్డి, గోగులపల్లి- అల్లూరుమండలం (ద్వితీయ), లెనిన్ ఎంటర్‌ప్రైజెస్, పొట్టేపాలెం-నెల్లూరు రూరల్(తృతీయ), మద్దిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, గొల్లపల్లి- ఆత్మకూరు మండలం(నాల్గవ), తాళ్ల నరసింహ నాయుడు,తిక్క వరం-మర్రిపాడు మండలం (ఐదవ),షేక్ సాజిద్, మునిముర్రె, నెల్లూరు రూరల్(ఆరవ), బాలంరెడ్డి గోవిందురెడ్డి, చౌదరిపాలెం, కావలి రూరల్(ఏడవ), ఏలూరి సుమంత్‌నాయుడు, గౌండ్లవేడు, ఆత్మకూరు మండలంఎనిమిదవ స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేశారు.

స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా 28న నిరసన దీక్ష

● విద్యుత్ పోరాట ఐక్యవేదిక



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా ఈ నెల 28న నిరసన దీక్ష చేపడుతు న్నట్లు విద్యుత్ పోరాట ఐక్యవేదిక నాయకులు వెల్లడించారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా గురువా రం నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడు తూ స్మార్ట్‌మీటర్ల వల్ల ప్రజలపై రూ.15,400 కోట్ల భారం పడుతుందన్నా రు. సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి మాట్లాడుతూ కరెంటు చార్జీలు పెంచం, స్మార్ట్‌మీటర్లు బిగించం అని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఇప్పుడు సర్‌చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారం వేసేందుకు, స్మార్ట్‌మీటర్లు బిగించేందుకు సిద్ధపడటం దుర్మార్గమన్నారు. సీపీఐఎంఎల్ నాయకుడు రాంబాబు మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్లు బిగిస్తే మరోసారి విద్యుత్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకుడు నందిపోగు రమణయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు షానవాజ్, గంగపట్నం రమణయ్య, జిల్లా వ్యవసాయ సంఘం అధ్యక్షుడు లీలా మోహన్, సీపీఎం నాయకులు మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నా తదితరులు పాల్గొన్నారు.

జనారణ్యంలోకి చుక్కల దుప్పి

● రక్షించిన ఆర్టీసీ సిబ్బంది

ఉదయగిరి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని కోనకాలువ వద్ద దాహార్తి తీర్చుకుంటున్న చుక్కల దుప్పిని వీధి కుక్కలు వెంటాడడంతో ఆర్టీసీ సిబ్బంది రక్షించిన సంఘటన గురువారం ఉదయగిరిలో చోటుచేసుకొంది. వివరాల మేరకు.. అటవీ ప్రాంతం నుంచి దాహం తీర్చుకునేందుకు వచ్చిన చుక్కల దుప్పిని వీధికుక్కలు వెంటాడడంతో అది ఆర్టీసీ డిపోలోకి పరుగులు తీసింది. అక్కడి సిబ్బంది దానిని రక్షించి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఏబీవో వెంకటేశ్వర్లు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని దుప్పిని స్వాధీనం చేసుకుని దుర్గంపల్లి అటవీ ప్రాంతంలో వదిలారు.



దుప్పిని రక్షించిన ఆర్టీసీ సిబ్బంది

నేడు ప్రధానోపాధ్యాయుల సమావేశం

ఉదయగిరి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవనంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు సమావేశం జరుగుతుందని ఎంఈవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ప్రధానోపాధ్యాయులంతా తప్పనిసరిగా హాజరు కావాలని వారు కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9507
వెండి కిలో ధర	రూ. 116300
వెండి ఒక గ్రాము	రూ. 119.30

శిథిలావస్థలో దోబీఘాట్

● రజకుల అవస్థలు ● పట్టించుకోని పాలకులు, అధికారులు


కొరిమెర్లలో నిరుపయోగంగా దోబీఘాట్

సంగం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరిమెర్లలో దోబీఘాట్ శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారడంతో కులవృత్తిని నమ్ముకొని జీవిస్తున్న రజకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని కుల వృత్తులను నిర్లక్ష్యం చేసింది. దీంతో ఆదరణ కరువై, కనీస సౌకర్యాలు లేక రజకులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో 14 కుటుంబాల రజకులు ఉన్నారు. వీరు కులవృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. గతంలో గ్రామంలోని చెరువు నీటిలో బట్టలు ఉతుక్కుని జీవనం సాగించేవారు. చెరువులో నీరు లేనపుడు బట్టలు ఉతకడానికి ఏడు కిలోమీటర్ల దూరం సంగం పెన్నానదికి వెళ్లాల్సి వచ్చేది. దీన్ని గమనించిన అప్పటి పాలకులు, అధికారులు 15 ఏళ్ళ కిందట రూ. 4.5 లక్షలతో కొరిమెర్లలో దోబీఘాట్ నిర్మించారు. ఐదేళ్ళ కిందట అది మరమ్మతులకు గురైంది. మోటారు చెడిపోయింది. ఆతరువాత బోరు పాయింట్ పూడిపోయింది. దీన్ని మరమ్మతులు చేయించుకునేందుకు ఆర్థిక స్థోమతలేక అధికారుల చుట్టూ తిరిగారు. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. నిధులు మంజూరు కాకపోవడంతో నిరుపయోగంగా వదిలేశారు. అప్పటి నుంచి గ్రామంలోని చెరువు నీటిలో బట్టలు ఉతుక్కుంటూ కులవృత్తిని కొనసాగిస్తున్నారు. వర్షాలు సరిగా కురవనపుడు వేసవిలో చెరువులో చుక్క నీరులేక ఎండిపోతుంది. ఇలాంటి సమయాల్లో గ్రామం నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలో సంగం పెన్నానదికి వెళ్ళాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కొరిమెర్ల చెరువులో నీరులేక ఎండిపోయింది. ఇంట్లో బోరు పాయింట్ల వద్ద బట్టలు ఉతుకుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి నూతన దోబీఘాటుకు నిధులు మంజూరు చేయాలని స్థానిక రజకులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీల ఆందోళన


ఉదయగిరి తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు


వరికుంటపాడులో మానవహారంగా ఏర్పడి ఆందోళన చేస్తున్న కార్యకర్తలు

ఉదయగిరి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ కార్యకర్తలకు అందజేసిన ఫోన్‌లు సక్రమంగా పనిచేయక పోవడంతో లబ్ధిదారుల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్యకర్తలకు వెంటనే 5జీ ఫోన్‌లు అందజేయడంతోపాటు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం నెలకు రూ26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కోడె రమణయ్య, గడ్డం నాగేశ్వరరావు, షేక్ నాయబ్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● **వరికుంటపాడు (ఉదయగిరి రూరల్):** తమ సమస్యలను పరిష్కరించాలంటూ గురువారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా యూనియన్ నాయకురాలు రజియా మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం బస్టాండ్ సెంటర్ సమీపంలోని రహదారిలో మానవహారంగా ఏర్పడి నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

● **ఏఎస్ పేట :** అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వారు ఏఎస్ పేట బస్టాండ్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మానవహారం నిర్వహించారు. ఎఫ్ఆర్ఎస్‌ను రద్దుచేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గంటలక్ష్మిపతి, నిస్సార్, సిఐటియు మండల కార్యదర్శి గయాజ్, తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు శ్రీకారం



ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్న గణేష్ భక్త మండలి సభ్యులు

ఆత్మకూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జేఆర్‌పేట ఎక్స్‌టెన్షన్ ఏరియాలో గురువారం గణేష్ భక్తి మండలి సభ్యులు ధ్వజారోహణతో వినాయక చవితి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కె ఓబుల్‌రెడ్డి, ప్రసాద్‌నాయుడు తదితరులు మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ నుంచి మూడు రోజులపాటు ఘనంగా ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. మొదటి రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు, నృత్య ప్రదర్శనలు, కోలాటాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. మూడవ రోజు సాయంత్రం నిమజ్జన కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గణేష్ భక్తి మండలి సభ్యులు సురేంద్రరెడ్డి, సివిరెడ్డి, కె రవీంద్రకుమార్, అయ్యన్న, పద్మనాభరెడ్డి, ఎం వెంకటేశ్వర్లురెడ్డి, పలువురు మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి బాలాలయ కార్యక్రమం పూర్తి

వింజమూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండెమడకల గ్రామంలో శిథిలావస్థకు చేరిన కోదండరామస్వామి ఆలయ పునర్నిర్మాణానికి బుధ, గురువారాల్లో చేపట్టిన బాలలయ కార్యక్రమం పూర్తయిందని ఆలయ నిర్వాహకులు తెలియజేశారు. గురువారం ఉదయం ఆలయంలో రుత్విక్కుల సహకారంతో సంప్రోక్షణ, గోపూజ, కలశ పూజ, హోమాది కార్యక్రమాలు జరిపించారు. ఈసందర్భంగా కమిటీ ఛైర్మన్ అంకినపల్లె ఓబుల్‌రెడ్డి, సభ్యులు గాలి నరసన నాయుడు, ఛైర్మన్ రత్నాకర్‌రెడ్డి మాట్లాడుతూ నిధుల మంజూరుకు సహకరించిన దేవదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ సభ్యు రాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యురాలు బూరాల శ్రీనివాసులుయాదవ్, దాట్ల విజయభాస్కర్‌రెడ్డి, సుంకం వెంకటేశ్వర్లు, ఎస్‌కె ఖాజావలి, నల్లబోతుల హజరతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు మండల మైనార్టీ అధ్యక్షుడిగా సందానిబాష


షేక్ సందానిబాషాను సన్మానిస్తున్న దళిత గిరిజన మైనార్టీ సంఘాల జేఏసీ వ్యవస్థాపకుడు పాలకీర్తి రవి

ఆత్మకూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): దళిత గిరిజన మైనార్టీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం ఆత్మకూరు మండల కమిటీని ఎంపిక చేశారు. ఆత్మకూరు మండల మైనార్టీ అధ్యక్షుడిగా సందానిబాష ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా దళిత గిరిజన మైనార్టీ సంఘాల జేఏసీ వ్యవస్థాపకుడు పాలకీర్తి రవి సందానిబాషాను అభినందించారు. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ మస్తాన్, రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు చల్లా మాధవి, ఉపాధ్యక్షుడు సముద్రాల దావీద్ మాట్లాడుతూ దళిత గిరిజన మైనార్టీ వర్గాల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు. కార్య క్రమంలో కోవూరు డివిజన్ అధ్యక్షుడు చితల అనితమ్మ, జిల్లా దళిత యువత అధ్యక్షుడు తుమ్మ వాసు, జిల్లా మైనార్టీ యూత్ అధ్యక్షుడు షేక్ రఫీ, ఏఎస్‌పేట మండల మైనార్టీ అధ్యక్షుడు షేక్ ఖాజాహుస్సేన్ పాల్గొన్నారు.

పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోండి

ఆత్మకూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో మొత్తం 4861 మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నామని, ఇటీవల నిర్వహించన పరిశీలనలో 90 మందికి రద్దయ్యాయని ఎంపీడీవో పి రఫీఖాన్ తెలిపారు. అయితే రద్దయిన 90 దివ్యాంగుల పింఛన్లల్లో 46 వృద్ధాప్య పెన్షన్లుగా మార్పిడి చేశారన్నారు. ఇక మిగిలిన 44 మందికి పింఛన్లు రద్దయ్యాయని, వారిలో అర్హులు ఉంటే తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుతో పాటు వారి ఆధార్‌కార్డు, సదరన్ సర్టిఫికెట్, రద్దు పరచబడిన నోటీసును జతచేసి మండల పరిషత్ కార్యలయంలో ఇవ్వాలని తెలిపారు.

రైతు సేవలో పీఏసీఎస్‌లు ముందుండాలి : కురుగొండ్ల


ప్రమాణస్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

కలువాయి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రైతులకు సేవలందించండంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్) ముందుండాలని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. కలువాయి పీఏసీఎస్ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమానికి గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు పీఏసీఎస్‌ల ద్వారా సీజన్‌లో ఎరువులు, రుణాలు సక్రమంగా అందించాలని, సహకార సంఘం అభివృద్ధితో పాటు రైతు సేవలే లక్ష్యంగా పనిచేయాలని నూతన పాలకవర్గ సభ్యులకు ఆయన సూచించారు. అనంతరం పీఏసీఎస్ నూతన అధ్యక్షుడు జగదల్‌నాయడు, సభ్యులు నాలి పెంచలయ్య యాదవ్, గ్రంధి సరేష్‌లను ఎమ్మెల్యే అభినందించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర వచ్చేంత వరకు నిల్వ చేసుకునేందుకు గోదాములను కలువాయిలో నిర్మించేందుకు తమ వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా మర్కెటింగ్ కమిటీ ఛైర్మన్ గంగోటి నాగేశ్వరావు మాట్లాడుతూ కలువాయి ప్రాంత రైతులకు ఎరువుల కొరత రానివ్వకుండా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ వేలూరు కేశవచౌదరి, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు జెన్ని రమణయ్య, ఎస్ఎస్ఆర్ నాయుడు, తోట కృష్ణయ్య, స్థానిక నాయకులు జీ వెంకటేశ్వర్లు నాయడు, చల్లా రఘురామిరెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి, ఏ వేణుగోపాల్‌రెడ్డి, చల్లా బుజ్జిరెడ్డి, వీర్ల సోమయ్య, నీటి సంఘాల ప్రతినిధులు చల్లా విజయభాస్కర్‌రెడ్డి, మల్లు విజయకుమార్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అధ్యాపకులను నియమించి.. మా భవిష్యత్తును కాపాడండి

కలువాయి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అధ్యాపకులను నియమించి మా భవిష్యత్తును కాపాడండి అంటూ కలువాయి హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ చదువుతున్న పలువురు బాలి కలు గురువారం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. స్థానిక హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపులో 140 మంది విద్యార్థులము చదువుకొంటున్నాము. ఈఏడాది జరిగిన బది లీల్లో ఇంగ్లీషు, ఫిజిక్స్, బాటనీ ముగ్గురు అధ్యాపకులు బదిలీపై వెళ్లిపోయారు. వారి స్థానంలో ఇంతవరకూ ఎవ్వరినీ అధికారులు నియమించలేదు. అప్పటి నుంచి అధ్యాపకులు లేరు. విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తోంది. ఈ సమస్యను ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకుపోయి అధ్యాపకులను నియమించి భవిష్యత్తు కాపాడాలని వారు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు.

ప్రతీ అర్జీని పరిశీలించి పరిష్కరిస్తాం : ఆర్డీవో


అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో పావని

మర్రిపాడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయ ఆవరణలో గురువారం ఆత్మకూరు ఆర్డీవో పావని ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలపై మొత్తం 96 అర్జీలను ఆర్డీవో స్వీకరించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ అర్జీలలో అధికంగా అసైన్డ్ భూముల పట్టాదారులు మరణించగా వారసుల పేర్లతో భూమిని కంప్యూటర్ అడంగల్‌లో నమోదుచేయాలని వచ్చాయని, ప్రతీ అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేలా చూస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు అనీల్‌కుమార్, టీడీపి మర్రిపాడు మండల అధ్యక్షుడు గంగాదర్, భీమవరం సొసైటీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి


రైతుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి

సీతారామపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పబ్బులేటిపల్లి గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో గురువారం రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి మాట్లాడుతూ రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి సాగు ఖర్చు తగ్గించుకొని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. అనంతరం సాగులో ఉన్న వరిపంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సుధీర్‌కుమార్, గ్రామ సర్పంచ్ ఆదినారాయణ, విఏఏలు వెంకటేశ్వర్లు, భరత్‌కుమార్, పవన్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఘనంగా శ్రీకృష్ణుడి గ్రామోత్సవం


శ్రీకృష్ణుడి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

దుత్తలూరు (ఉదయగిరి), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక దుత్తలూరు సెంటర్‌లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా చివరి రోజైన గురువారం స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా దుత్తలూరు సెంటర్, గ్రామం, కాలనీల్లో స్వామివారి గ్రామోత్సవం సాగింది. భక్తు లు స్వామివారికి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు.

పింఛన్ ఇప్పించి ఆదుకోవాలి


వినతిపత్రం అందిస్తున్న షబ్బీర్

ఉదయగిరి రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పింఛనే జీవనాధారంగా బతుకుతున్న తనకు పింఛను రద్దు చేస్తున్నట్లు నోటీసులు అందించడం ఎంతవరకు సమంజసమని వెంగళరావు నగర్ గ్రామానికి చెందిన షేక్ షబ్బీర్ అనే దివ్యాంగుడు ఆవేదన వ్యక్తంచేశాడు. గురువారం స్థానిక సచివాలయానికి వెళ్లి తన వద్ద ఉన్న ఆధారాలను వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లికార్జునకు అందించి పింఛను ఇప్పించి ఆదుకోవాలని వేడుకున్నాడు. వెల్ఫేర్ అసిస్టెంట్ మాట్లాడుతూ సచివాలయ పరిధిలోని వెంగళరావునగర్‌లో 11, గండిపాళెంలో మరో 9 పింఛన్లను రద్దుచేస్తున్నట్లు నోటీసులు అందించడం జరిగిందన్నారు. వాటిల్లో అర్హత ఉన్నవారు మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు జూనియర్స్ షూటింగ్ బాల్ క్రీడాకారుల ఎంపిక

సంగం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు జూనియర్స్ బాలబాలికల షూటింగ్ బాల్ క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని నెల్లూరు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బివి రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడా ఎంపికలకు హాజరయ్యే వారు తమ వెంట ఆధార్ కార్డు, పదవ తరగతి పాస్ మార్కుల లిస్టు, లేదా జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని తెలిపారు. వివరాలకు 9490320435, 855518911 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.


ఎంఈవో-1 బాధ్యతల స్వీకరణ

దుత్తలూరు(ఉదయగిరి), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల విద్యా శాఖాధికారి-1గా గురువారం ఫజుల్‌అలీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంఈవో పద్మనాభరావు జలదంకి మండలానికి బదిలీ అయ్యారు. కాగా నెల్లూరు సంతపేట ఆదర్శ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఫాజుల్‌అలీని జిల్లా విద్యా శాఖాధికారి ఇక్కడికి నియమించడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

సీతారామపురం తహసీల్దార్‌గా ఫజిహా బాధ్యతల స్వీకరణ

సీతారామపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండల అడహక్ తహసీల్దార్‌గా షేక్ ఫజిహా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె జిల్లా సివిల్ సప్లైస్‌లో ఐఓసీఎల్ ఎల్పిజి అవుట్ లెట్ స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ అడహక్ తహసీల్దార్‌గా బదిలీపై సీతారామపురం మండలానికి వచ్చారు.

క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యనందించాలి


ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈవో వెంకటేశ్వర్లు

ఉదయగిరి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యనందించాలని ఎంఈవోలు తిప్పరెడ్డి వెంకటేశ్వర్లు, తోట శ్రీనివాసులు ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం పట్టణంలోని యాదవపాళెం, మెయిన్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం సంబంధిత రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనాన్ని రుచిచూసి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సయ్యద్ జాఫర్ మొహిద్దీన్, ఉపాధ్యాయిని సుబ్బ మ్మ, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

స్టీల్ తరలింపు ఇంటి దొంగ పనే!

● అధికారులు, పోలీసుల ఎదుట అంగీకరించిన ఏఈ


ముళ్లపొదల్లో ఉన్న స్టీల్

దుత్తలూరు(ఉదయగిరి), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టపగలే దుత్తలూరు గృహ నిర్మాణ శాఖ గోదాము చి బుధవారం స్టీల్ (ఇనుప చువ్వ)ను తరలిస్తుండగా పోలీసులు వెంటాడి పట్టుకున్న విషయం తెలిసిందే. కాగా, ఆ ఇనుమును అక్రమంగా తలించింది అక్రమార్కులు కాదు.. సాక్షాత్తూ ఆ శాఖ ఉదయగిరి ఏఈ రామకృష్ణ అని రుజువైంది. అధికారులు రంగప్రవేశం చేయడంతో ఇనుమును తానే తరలించానని, పొరపాటైందని, ఇకమీదట ఇలాంటి పనులు చేయనంటూ బుధవారం రామకృష్ణ అధికారులు, పోలీసులకు లిఖితపూర్వకంగా అందజేశారు.

ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం
నారాయణరెడ్డి, ఈఈ, గృహ నిర్మాణ శాఖ

దుత్తలూరు గృహ నిర్మాణ శాఖ గోదాము నుంచి అక్రమంగా స్టీల్ తరలింపు ఘటనపై ఉన్నతాధికారులకు నివేదికం పంపాం. స్టీల్ తరలించిది తానేనని ఏఈ రామకృష్ణ ఒప్పుకుని లిఖితపూర్వకంగా అందజేశారని ఆయన తెలిపారు.

ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా పట్టలేడు

ఇంటి దొంగను ఈశ్వరుడు కూడా పట్టలేరన్న చందంగా తయారైంది గృహ నిర్మాణ శాఖ అధికారుల పనితీరు. ఎవరైనా ఫిర్యాదు చేస్తేనో, సమాచారం అందిస్తోనో తప్ప వారి అసలు బండారం బయట పడట్లేదు. జిల్లాలో యథేచ్ఛగా స్టీల్, సిమెంట్ అక్రమంగా తరలించి సొమ్ము చేసుకోవడం వారికి పరిపాటిగా మారింది. అందుకు ఉదాహరణే బుధవారం దుత్తలూరు హౌసింగ్ గోదాము నుంచి ఆ శాఖ ఏఈ అక్రమంగా వాహనంలో స్టీల్ తరలించడం. దుత్తలూరు ఏఈ యప్రాయం ఈఏడాది ఏప్రిల్, మే మాసాల్లో సెలవు పెట్టడంతో ఉన్నతాధికారులు రామకృష్ణకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆసమయంలో సైతం గోదాము నుంచి నాలుగైదు సార్లు స్టీల్ అక్ర మంగా తరలించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ అను మానంతోనే అక్కడ పనిచేస్తున్న హౌసింగ్ సిబ్బంది గోదాముపై ప్రత్యే క నిఘా ఉంచడంతో ఈ అక్రమ స్టీల్ తరలింపు వ్యవహారం బట్టబ యలైందని పలువురు చర్చించుకుంటున్నారు. దీనికితోడు లబ్ధిదారు లకు అందజేయాల్సిన సిమెంట్ సైతం అధికారుల నిర్లక్ష్యం కారణంగా గోదాములో గడ్డకట్టిపోయింది. ఎలాంటి రక్షణ లేకుండా స్టీల్ గోదాము ఆరుబయట ముళ్లచెట్లలో పడేశారు. దీంతో ఆ శాఖ అధికారే దానిని గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య


శివకుమార్‌రెడ్డి మృతదేహం

కోవూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక గుమ్మళ్లదిబ్బ కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ కలికి శివకుమార్ రెడ్డి (49) గురువారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇనమడుగు రోడ్డు కూడలికి సమీపంలోని పొలంలో మృతదేహన్ని స్థానిక రైతులు గుర్తిం చి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నట్లు ఎస్‌ఐ రంగనాథ్ గౌడ్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

11 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్


పోలీసులు అదుపులో ఉన్న పేకాటరాయుళ్లు

ఆత్మకూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని నారంపేట సమీపంలోని పంట పొ లాల్లో పేకాట స్థావరా లపై సీఐ జి గంగాధర్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం దాడి చేసి 11 మంది పేకాటరాయుళ్ల ను అరెస్ట్ చేశారు. వారి వద్ద ఉన్న రూ. 5,10,000 నగదును, మోటారు బైక్‌ను స్వాధీనపరుచుకున్నారు. కేసు నమోదు చేసి పేకాటరాయుళ్ల ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ గంగాధర్ మాట్లాడుతూ పేకట స్థావరాలు, గంజాయి విక్రయాలు తదితర అ సాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు. గ్రామాల్లో అసాంఘీక కార్యక్రమాలు జరుగుతుంటే పోలీసులకు సమా చారం అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు, అనంతసాగరం, సంగం, ఏఎస్‌పేట ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మోటారు బైకు, బొలెరో ఢీ

● ఒకరికి తీవ్ర గాయాలు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 21 (ఆంధ్ర జ్యోతి): ఎదురెదురుగా వస్తున్న మోటారుబైకు, బొలెరో వాహనం ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం బోగ్యంవారిపల్లి బస్టాండ్ సెంటర్‌లోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. వివరాల మేరకు.. తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన దేవరపు మాలకొండయ్య అనే వ్యక్తి పొలం నుంచి పశువుల మేతను మోటారుబైకుపై తీసుకెళ్తున్నాడు. అదే క్రమంలో ప్రకాశం జిల్లా మార్టూరు నుంచి ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం మోటారుబైకును ఢీకొంది. దీంతో మోటారు బైకు బోల్తా పడడంతో మాలకొండయ్యకు తీవ్ర గాయాల య్యాయి. దీంతో చికిత్స నిమిత్తం ప్రకాశం జిల్లా పామూరుకు తరలిం చారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

వెంకటాచలం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : తిక్కవ రప్పాడు రోడ్డులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సర్వేపల్లి గ్రామానికి చెందిన తెనాలి శేఖర్ బైక్‌పై సర్వేపల్లి నుంచి వెంకటాచలం వైపు వెళ్తుండగా రాంగ్ రూటులో వచ్చిన ఆయిల్ ట్యాంకర్ బైక్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ శేఖర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసు లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోవూరు ఎమ్మెల్యేకి బెదిరింపు లేఖ..

ఒకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి బెదిరింపు లేఖ రాసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ నెల 17వ తేదీ గుర్తుతెలియని వ్యక్తి నెల్లూరులోని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నివాసానికి వచ్చి భద్రత సిబ్బందికి ఓ లేఖ ఇచ్చి వెళ్లాడు. ప్రజలు వారి సమస్యలు పరిష్కరించమని అర్జీలు ఇస్తున్నట్లుగా భావించిన భద్రత సిబ్బంది ఆ లేఖను కార్యాలయ సిబ్బందికి అందించారు. లేఖను పరిశీ లించగా ప్రశాంతిరెడ్డి రూ. 2 కోట్లు ఇవ్వాలని, లేకుంటే చం పేస్తామని రాసి ఉంది. సిబ్బంది వెంటనే విషయాన్ని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి తెలిపారు.పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. అల్లూరు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి లేఖ రాసినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. గూగుల్, యూట్యూబ్‌లో శోధించి లేఖ రాసినట్లు నిందితుడు తెలిపినట్లు సమాచారం. అయితే పోలీసులు అదుపులోకి తీసుకున్న వ్యక్తికి గతంలో ఎలాంటి నేర చరిత్ర లేదని, కేసులు లేవని తెలిసింది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	224

కోడిగుడ్ల ధర (100): 525

డ్రైనేజీ కాలువల్లో పూడికతీత

కావలి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటిపారుదలకు ఆటంకం లేకుండా పట్టణంలోని ప్రధాన డ్రైన్లలో గురువారం మున్సిపల్ కార్మికులు పూడికతీత చేపట్టారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్మికులు కాలువల్లో పూడిక తొలగిస్తున్నారు. జనతాపేటలోని 29, 31 వార్డులకు సంబంధించి రైల్వేట్రాక్ వెంబడి ఉన్న ప్రధాన డ్రైన్‌లో పూడిక తీస్తున్నారు. ఈ పనులను స్థానిక టీడీపీ నాయకులు తలపనేని ప్రభాకర్, దశయ్య పర్యవేక్షించారు. అలాగే ట్రంకురోడ్డులో తూర్పు వైపున ఉన్న ప్రధాన డ్రైన్‌లో కూడా మూతబండలు తొలగించి పూడిక తీస్తున్నారు.



వచ్చే నెలాఖరుకు ఉత్తర కాలువ పనులు

● అక్టోబరు నుంచి రాళ్లపాడుకు నీరు ● నెరవేరనున్న రైతుల కల



రాళ్లపాడు ఉత్తర కాలువ వెడల్పు పనులు చేస్తున్న యంత్రాలు



ఉత్తర కాలువపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం

లింగసముద్రం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నుంచి రాళ్లపాడు ప్రాజెక్టుకు నీరందించే ఉత్తర కాలువ వెడల్పు పనులు వేగంగా జరుగుతున్నాయి. వచ్చే నెలాఖరుకు ఈ పనులు పూర్తవుతాయని, అక్టోబరు మొదటివారం నుంచి రాళ్లపాడుకు నీరు వచ్చే అవకాశం ఉందని ప్రాజెక్టు ఈఈ మునిరత్నం, డీఈలు శేషయ్య, వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉత్తర కాలువ వెడల్పు పనులు 89 కి.మీ నుంచి 95వ కి.మీ మధ్య జరుగుతున్నాయి. కాలువపై అక్కడక్కడా వంతెనల నిర్మాణం కూడా జరుగుతున్నది. గతంలో 150 క్యూసెక్కుల నీటిని మాత్రమే సరఫరా చేసేలా కాలువ వెడల్పు 3.7 మీటర్లు మాత్రమే ఉండేది. అయితే రాళ్లపాడుకు 600 క్యూసెక్కుల నీటిని అందించేలా కాలువను 10 మీటర్ల వెడల్పు చేస్తున్నారు. ఈ పనులు పూర్తయ్యాక సోమశిల నుంచి 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారు. ఎన్నో ఏళ్ల నుంచి సోమశిల జలాల కోసం ఎదురుచూస్తున్న రైతుల కల ఎట్టకేలకు అక్టోబరులో నెరవేరనున్నది.



సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వెటర్నరీ ఏడీ చెన్నకేశవులు

వలేటివారిపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వాధుల పట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని వెటర్నరీ ఏడీ డాక్టర్ ఎంతోటి చెన్నకేశవులు తెలిపారు.

ఈ ఇంటర్వ్యూ

? : ఈ సీజన్‌లో పశువులకు ఏయే వ్యాధులు వ్యాపిస్తాయి.

! : ఈ సీజన్‌లో గొంతువాపు, పొదుగువాపు, శ్వాసకోశ వ్యాధులు వ్యాపిస్తాయి.

? : పశుపోషకులకు ప్రభుత్వ సబ్సిడీ పథకాలు ఏమేమీ ఉన్నాయి ?

! : రైతులకు పశుకిసాన్ క్రెడిట్ పథకం, నేషనల్ లైవ్ స్టాక్ పథకం కింద సబ్సిడీ రుణాలు అందుబాటులో ఉన్నాయి.

? : వైద్యులు, సిబ్బంది కొరతతో సకాలంలో వైద్యం అందడంలేదని రైతులు అంటున్నారు.

! : పోకూరులో డాక్టర్ పోస్టు, పోలినేని చెరువు, కళవళ్ల సచివాలయాల్లో వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

మురుగు కాలువల్లో పైరోసిన్ ఆయిల్ పిచికారీ

కందుకూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): దోమల నిర్మూలనలో భాగంగా పట్టణమంతా మురుగు కాలువల్లో పైరోసిన్ ఆయిల్ పిచికారీ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కే. అనూష తెలిపారు. కొద్దిరోజులుగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఈ పని పూర్తిచేశామన్నారు. గురువారం నాంచారమ్మ కాలనీ, కృష్ణ బలిజసంఘం, కోటారెడ్డి నగర్‌లో పిచికారి చేయించామన్నారు. మురుగుకాలువల్లో దోమలు లార్వా వృద్ధి చెందకుండా నిర్మూలించటం లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆమె తెలిపారు.



మురుగు కాలువల్లో పైరోసిన్ ఆయిల్ పిచికారీ చేస్తున్న పారిశుధ్య కార్మికుడు

భూసార పరీక్షలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారిణి గీతాకుమారి

కొండాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలపై రైతులకు అవగాహన ఎంతో అవసరమని జిల్లా వనరుల కేంద్రం నెల్లూరు వ్యవసాయ అధికారిణి గీతాకుమారి అన్నారు. గురువారం మండలంలోని సాయిపేట రైతుసేవాకేంద్రంలో రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు.ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించుకొని దానికి అనుగుణంగా భూమిలో పైర్లు సాగుచేసుకోవచ్చన్నారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీహరినారాయణ, గుడవళ్లూరు సొసైటీ అధ్యక్షుడు కే. మోహనరావు, జిల్లా టెలికాం బోర్డు మెంబరు టీ. అనూష, సాగునీటి సంఘ అధ్యక్షుడు టీ. ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, వీఏఏ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా ప్రతాప్ దిష్టిబొమ్మల దహనం



కావలి : మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ నేతలు

కావలి,ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిపై హత్యాయత్నాన్ని నిరసిస్తూ, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిని అరెస్ట్ చేయాలని టీడీపీ శ్రేణులు గురువారం వాడవా డలా ప్రతాప్ దిష్టిబొమ్మలను దహ నం చేశారు. కొన్ని ప్రాంతాల్లో ప్రతాప్ రెడ్డి బొమ్మలతో నిరసన తెలిపారు. పాతూరులోని క్రిష్ణుడి బొమ్మ సెంటర్, 31వ వార్డులో జనతాపేటలోని పెద్దపవని రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద, ముసునూరు సెంటర్‌లోని ట్రంకు రోడ్డులో, 8వ వార్డులోని వివేకానంద పార్కు ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. 26, 29 వార్డులకు చెందిన టీడీపీ శ్రేణులు ఉదయగిరి రోడ్డులో ప్రతాప్‌రెడ్డి చిత్రపటంతో నిరసన తెలిపారు.

● హత్యారాజకీయాలు అలవాటే...

బిట్రగుంట : మాజీ ఎ మ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పదేళ్ల పదవీకా లంలో హత్యలు, అవినీతి రాజకీయాలు చేయ డం అలవాటేనని టీడీపీ మండల కన్వీనర్ నాగే శ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు దుయ్యబట్టారు. బోగోలు టీడీపీ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి దిష్టిబొమ్మను బోగోలు బజారు కూడల్లో దహనం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సుధీర్ బాబు, వెంకటేశ్వర్లు రెడ్డి, రఘురాం నాయుడు, ఆదిశేషయ్య, ప్రసన్న మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

● హత్యాయత్నాన్ని ఖండిస్తున్నాం...

దగదర్తి (బిట్రగుంట) : ఎమ్మె ల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిపై హత్యాయ త్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి అన్నారు. గురువారం దగదర్తి కెనరా బ్యాంక్ వద్ద నుంచి ప్రతాప్ దిష్టిబొమ్మను పాడిపై పడుకో పెట్టి వినూత్నంగా శవయాత్ర చేశారు.ఈ కార్యక్ర మంలో టీడీపీ నేతలు హనుమంతరా వు,హ రిరెడ్డి, వీ. కొండపునాయుడు వీ. వినయ్ కుమార్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



బోగోలు జజారు కూడలిలో ప్రతాప్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ శ్రేణులు

మేత పోరంబోకు భూముల్లోని ఇళ్ల పరిశీలన



యర్రారెడ్డిపాలెం పంచాయతీ రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ హిమవంశీ, తదితరులు

లింగసముద్రం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యర్రారెడ్డిపాలెంలోని పశువుల మేత పోరంబోకు భూముల్లో కట్టుకున్న ఇళ్లను, పొలాలను కందుకూరు సబ్‌కలెక్టర్ దామెర హిమవంశీ పరిశీలించారు.గురువారం మధ్యాహ్నం తహసీల్దార్ కోటేశ్వరరావు, ఎంపీడీవో శ్రీనివాసులతో కలిసి ఆయన గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని సర్వే నంబరు 101/2లోని 711 ఎకరాల పోరంబోకు భూముల్లో సుమారు 120 ఎకరాల్లో గ్రామస్థులు కొందరు 350 ఇళ్లు కట్టుకొని నివాసం ఉంటున్నారు.ఈ విషయమై గ్రామస్థులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు పీజీఆర్‌ఎస్‌లో వినతిపత్రం ఇచ్చారు.అలాగే గత మార్చి 3న పంచాయతీ వారు కూడా తీర్మానం చేశారు. దీంతో సబ్‌కలెక్టర్ గ్రామాన్ని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. అనంతరం ఆయన లింగసముద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను సందర్శించి, అధికారులు, వీఆర్వోలు, సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శుల కొరత గురించి ఆరా తీశారు.వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కన్వర్షన్ భూములపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రమణయ్య, వీఆర్వో నాగరాజు, పంచాయతీ కార్యదర్శి సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు

● వైద్య సిబ్బందిపై డీసీహెచ్‌ఎస్‌ల ఆగ్రహం



వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఒంగోలు, నెల్లూరు డీసీహెచ్‌ఎస్ అధికారులు శ్రీనివాస నాయక్, పరిమళ

ఉలవపాడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీహెచ్‌సీ వైద్యుల పనితీరు అసంతృప్తిగా ఉందని, తీరు మార్చుకోకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ హాస్పిటల్స్ సర్వీసెస్(డీసీహెచ్‌ఎస్) ఒంగోలు, నెల్లూరుకు చెందిన అధికారులు శ్రీనివాస్ నాయక్, పరిమళ హెచ్చరించారు. గురువారం వారిద్దరూ ఉలవపాడు సీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో 8 మంది వైద్యులు విధులు నిర్వహించాల్సి ఉండగా, ముగ్గురు మాత్రమే ఉన్నారు. అదే సమయంలో స్థానికులు సీహెచ్‌సీ వైద్య సేవలపై ఫిర్యాదులు చేశారు. పేరుకే 30 పడకల ఆసుపత్రి అయినా ఏరోజు కూడా పూర్తిస్థాయిలో వైద్యులు విధుల్లో ఉండరని, ఒకరో ఇద్దరో డ్యూటీలో వచ్చిన రోగులకు నామమాత్రంగా సేవలు అందిస్తున్నారని ఫిర్యాదు చేశారు. గైనకాలజిస్టు, జనరల్ మెడిసిన్ వైద్యులు, జనరల్ సర్జన్, బీపీ, షుగర్ వైద్యులు సెలవుల్లో ఉన్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు. చిన్నపిల్లల వైద్యులు, డెంటల్, మత్తుడాక్టర్ మాత్రమే గురువారం విధుల్లో ఉన్నారని పేర్కొన్నారు. అంతేకాక మధ్యాహ్నం, రాత్రులు డ్యూటీ డాక్టర్లు ఉండటం లేదన్నారు. వైద్య సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ పనితీరు మార్చుకోకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. శిథిలావస్థలో ఉన్న పాత ఆసుపత్రి భవనం తొలగించే ఏర్పాట్లు చేస్తామని వారు స్థానికులకు హామీ ఇచ్చారు.

న్యూస్ బాక్స్

విద్యార్థుల సమగ్ర వివరాలు నమోదు చేయాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈవో-1 రవికుమార్

కొండాపురం, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థుల సమగ్ర వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని ఎంఈవో-1 కే రవికుమార్ అన్నారు. గురువారం మండలంలోని సాయిపేట ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో జరిగే ప్రార్థనకు ప్రతీ ఒక్క ఉపాధ్యాయుడు, విద్యార్థి కచ్చితంగా హాజరకావాలన్నారు. అనంతరం కొత్తపాలెం ప్రాథమిక ఆదర్శ పాఠశాలను తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. శాంప్-1 మార్కుల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఉపాధ్యాయులకు తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం రమణ, దాత, ఉపాధ్యాయుడు వెంకటరావు

కొండాపురం, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేకునాంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ (దిక్సూచి)ను భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు ఎం.వెంకటరావు తన సొంత నిధులతో గురువారం అందచేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వీవీ.రమణ మాట్లాడుతూ స్టడీ మెటీరియల్ భౌతికశాస్త్ర నిపుణులతో బ్లూప్రింట్ ఆధారంగా రూపొందించామన్నారు. మెటీరియల్ అభ్యాసంతో పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించేందుకు వీలుంటుందన్నారు. మెటీరియల్ అందచేసిన ఉపాధ్యాయుడు వెంకటరావుకు ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఆర్థిక సాయం అందించడమే లక్ష్యం



సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ చేస్తున్న బీద గిరిధర్

అల్లూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రజలకు ఆర్థిక సహకారం అందించడంలో అనేక మార్గాలను ఎన్నుకుంటోందని, ఇందులో భాగమే సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ అని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు.మండలంలోని ఇస్కపల్లిలో ఆయన కార్యాలయంలో ముగ్గురు లబ్ధిదారులకు ఈ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తోట శ్రీహరి, బుచ్చింగారి బాబు, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధారాలతో అర్జీ సమర్పించాలి

కందుకూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రద్దయిన పింఛన్లలో కొందరు అర్హులకు కూడా అన్యాయం జరిగినట్లు ఫిర్యాదులు రావటంతో ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. పింఛన్లు కోల్పోయిన వారు ముందుగా ఏరియా హాస్పటల్ మెడికల్ బోర్డుకు హాజరైతే వారు పరీక్షించి మాన్యువల్ సర్టిఫికెట్ అందజేస్తారని, ఆ సర్టిఫికెట్ తీసుకుని పెన్షన్ రద్దుచేసిన సర్టిఫికెట్, పాత పెన్షన్ సర్టిఫికెట్, ఆధార్, పాస్‌పోర్టు సైజు ఫొటో జతచేసి మండలాల్లో ఎంపీడీవోలకు, పట్టణంలో మున్సిపల్ కమిషనర్‌కు అర్జీలు అందజేయాలని కోరారు. అర్హులందరికీ న్యాయం చేస్తామని ఆయన తెలిపారు.

వాటర్ క్యాన్లు, నోటు పుస్తకాల పంపిణీ



కందుకూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని సింహాద్రినగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. అలాగే రెండు కూలింగ్ వాటర్‌క్యాన్లు కూడా అందజేశారు. కార్యక్రమంలో రవ్వా శ్రీనివాసులు, చక్కా కేశవ, గోనుగుంట వేణుగోపాలరావు, శివసూర్యాచారి, రతన్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టే బాధ్యత అందరిదీ



బాల్యవివాహ నిరోధక చట్టం పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో, డీఎస్పీ తదితరులు

కావలి, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి పౌరుడు తీసుకోవాలని ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణ తెలిపారు. బాల్యవివాహాలను అరికట్టే విషయంపై గురువారం ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో డివిజన్‌స్థాయి అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో వక్తలు మాట్లాడుతూ బాల్యవివాహాలు వలన అనేక దుష్ప్రభావాలు ఉన్నాయని, వాటిని తెలియచేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీలు వారి ప్రాంతంలో టీనేజ్ వయసులో ఉన్న వారిని గుర్తించి వారి వివరాలు తెలుసుకుంటుండాలన్నారు. బాల్యవివాహాలు వల్లే జరిగే అనర్థాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం బాల్యవివాహనిరోధక చట్టంపై పుస్తకాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పీ.శ్రీధర్, ఐసీడీసీ పీడీ హేనా సుజన్, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్, చైల్డ్‌ప్రొటెక్షన్ జిల్లా అధికారి సురేష్, డివిజన్‌లోని తహసీల్దార్లు, ఎమ్పీడీవోలు, సీడీపీవోలు, ఎస్‌ఐలు, ఎంఈవోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీల నిరసన



కావలి : బ్రిడ్జి కూడలిలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

కావలి(టౌన్), ఆగస్టు21(ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారంలో భాగంగా అంగన్‌వాడీలు గురువారం బ్రిడ్జి కూడలిలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ అంగనావాడాలకు ఇప్పటివరకు ఉన్న యాప్‌లన్నీ రద్దు చేసి ఒకే యాప్ విధానం తీసుకురావలన్నారు. కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, 5జీ ఫోన్ ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి వై కృష్ణమోహన్, యూనియన్ అధ్యక్ష కార్యదర్శి రుక్మిణి,కే. సుభాషిణి, నాయకులు విజయలత, రఘురావమ్మ, జయంతి, ప్రభావతి, కళావతి, జ్యోతి, బిందు తదితరులు పాల్గొన్నారు.

● బిట్రగుంట : ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్లకు, ఆయాలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం నేతలు టీ.మాల్యాద్రి, టీ.వెంకయ్య డిమాండ్ చేశారు. బోగోలు మండల ఎంపీడీవో కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు, ఆయాలతో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం అమలు చేయాలని, ప్రభుత్వ పథకాలను అందచేయాలని అన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున సమ్మె చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

● జలదంకి : గత సమ్మె సందర్భంగా ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన నెలజీతం రూ.26వేలు హామీ అమలు పరచాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్క ర్స్ హెల్పర్స్ గురువారం సాయంత్రం జలదంకి బస్టాండ్ కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈ మానవహారంలో అంగన్‌వాడీలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ నాయకురాళ్ళు సుకన్య, తిరుపతమ్మ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే మీ డిమాండ్లను అమలు చేస్తామని టీడీపీ నేతలు హామీ ఇచ్చారని, కానీ తమ హామీలు నెరవేర్చలేదని ఆరోపించారు. ఇప్పటికైనా తమ హామీలను అమలుపరిచి అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులను ఆదుకోవాలని వారు కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే సమీక్షలు



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీదేవి

కావలి రూరల్, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే అధికారులు, పాలకులతో సమీక్షలు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో శ్రీదేవి పేర్కొన్నారు. పట్టణ ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీపీ ఆలూరు కొండమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల సమస్యలను గ్రామ నాయకులు తమదృష్టికి తెచ్చారని, వాటిని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికలోటులో ఉన్నందున గ్రామాల్లో మురుగునీటి కాలువల ఏర్పాటు ఖర్చుతో కూడుకున్నది కావటంతో మురుగు నీటిని రోడ్లపై కి వదలకుండా చూడాలన్నారు. స్త్రీ శక్తి పథకం ప్రజల ఆదరణ పొందిందని, ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగుదొడ్ల వసతి మెరుగుపర్చటంతో పాటు మహిళల రక్షణకు రాత్రిళ్లు పోలీస్ బీట్ ఏర్పాటు చేయించాలని ఆర్టీసీ అధికారులను కోరారు. మండలంలోని జువ్విగుంటపాలెం లో 4 నెలలుగా ఉపాధి పనులు పెట్టలేదని తాళ్లపాలెం సర్పంచి సురేష్ తెలపగా, సోమవారం నుంచి పనులు పెడతామని ఏపీవో చెంచయ్య తెలిపారు. అలాగే బట్లదిన్నె నుంచి తాళ్లపాలెం రోడ్డు మార్గంలో జెంగిల్ క్లియర్ చేయించాలన్నారు. చెన్నాయపాలెంకు బస్ వసతి కల్పించాలని ఎంపీటీసీ గంగన్నగారి యాదగిరి కోరారు. ఇలా అన్నీ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రజా సమస్యలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఏ. కవిత, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

పరాయి పంచన పఠనాలయం

● ఇన్‌చార్జి గ్రంథపాలకుడే దిక్కు ● పాఠకులు లేక వెలవెలబోతున్న లైబ్రరీ ● పట్టించుకోని అధికారులు



అద్దె భవనంలో నిర్వహిస్తున్న గ్రంథాలయం

వలేటివారిపాలెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో 39 ఏళ్లుగా గ్రంథాలయం అద్దె భవనంలో నడుస్తోంది.ఇక్కడ దివంగత సీఎం ఎన్టీఆర్ హయాంలో 1986 ఆగస్టులో గ్రంథాలయాన్ని ఓ ప్రైవేట్ భవనంలో ప్రారంభించారు. అప్పటి నుంచి అద్దె భవనంలోనే కొనసాగుతున్నది. ఇప్పటి వరకు రూ. 10 లక్షలకుపైగానే అద్దె చెల్లించి ఉంటారు. ప్రస్తుతం ఉన్న భవనానికి నెలకు అద్దె రూ.3 వేలనను ప్రభుత్వం చెల్లిస్తున్నది. అయితే ఈ భవనంలో వసతులు లేక పాఠకులు కూడ గ్రంథాలయానికి రావడం లేదు. బస్టాండు సెంటరులో గ్రంథాలయం ఉన్నప్పుడు పాఠకులతో కళకళలాడుతుండేది. ఇప్పుడు దాన్ని బీసీ కాలనీలోకి మార్చారు.అంతేకాక రెగ్యులర్ గ్రంథపాలకుడు లేడు. అద్దె భవనంలో పాఠకులు కూర్చోవడానికి కుర్చీలు, బల్లలు లేవు దినపత్రికలు కూడా రావడం లేదు. పిల్లలు చదువుకోవడానికి కథల పుస్తకాలు లేవు. పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్ లేదు. ప్రస్తుతం ఉలవపాడు గ్రంథపాలకుడు ప్రభాకర్‌రెడ్డి ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. భవన నిర్మాణానికి స్థలం చూపిస్తే నిధులు మంజూరు చేస్తామని ఉన్నతాధికారులు చెబుతున్నట్లు గ్రంథపాలకుడు చెబుతున్నారు. రెగ్యులర్ గ్రంథపాలకుడు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పోస్టు కూడా ఖాళీగానే ఉన్నాయి. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రంథాలయానికి సొంత భవనం నిర్మించాలి.

రైతులకు శిక్షణ

జలదంకి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని టీకే అగ్రహారంతి గ్రామ ఆర్‌ఎస్‌కేలో గురువారం రైతులకు పచ్చిరొట్టపైరు, జీవన ఎరువులపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సాంకేతిక వ్యవసాయాధికారి రామ్మోహన్, మండల వ్యవసాయాధికారిణి శ్రీవాణి. ఏఈవో శిల్పకళ, వీఏఏ శ్రీహరి పాల్గొన్నారు.



స్వామితో పెట్టుకుంటే పుట్టగతులుండవు

వేంకటేశ్వరస్వామితో రాజకీయాలు చేస్తే మీకు పుట్టగతులుండవు. వీఐపీ బ్రేక్ నుంచి సేవా టిక్కెట్ల వరకు వైసీపీ హయాంలో ఎన్నో అక్రమాలు జరిగాయి. గతంలో ఈవోగా ఉన్న ధర్మారెడ్డి టీటీడీని అడ్డు పెట్టుకుని డిల్లీలో ఏ స్థాయిలో పైరవీలు చేశారో అందరికీ తెలుసు. నీ ప్రియశిష్యుడిగా చెప్పుకొన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభ పెట్టడానికి రేషన్ వాహనాల్లో వేలకొద్దీ తిరుమల లడ్డూలు తీసుకెళ్లి పంచినప్పుడు తప్పనిపించలేదా కరుణాకర్‌రెడ్డి. పింక్ డైమండ్ పేరిట గ్లోబెల్స్ ప్రచారం చేశారు. స్వామి ప్రసాదాల్లో కల్తీ నెయ్యి మీ హయాంలోనే జరిగింది కదా? ఇప్పుడు నువ్వు నీతులు మాట్లాడుతున్నావా? తన సొంతఖర్చులతో నీళ్ల బాటిల్ కొనే టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిపై అవాకులు చెవాకులు పేలడం విడ్డూరంగా ఉంది.

- చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని. తిరుపతిరూరల్‌లో విలేకరుల సమావేశంలో..



టీటీడీని రాజకీయాలకు వాడుకోవద్దు

టీటీడీని కించపరచి, రాజకీయ అవసరాలకు వాడుకున్న వారు సుఖపడినట్లు చరిత్రలో లేదు. టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడిపై బురద చల్లిన పత్రిక, చానల్‌పై ఆయన పరువునష్టం దావా వేస్తే మీకొచ్చిన నష్టం ఏంటి? టీటీడీ చైర్మన్‌గా పనిచేసిన భూమన మంచి సలహాలు ఇవ్వాలే కానీ, ఇలా దిగజారి ప్రవర్తించడం సరికాదు. బీఆర్ నాయుడు వచ్చాకే గోశాలలో గోవులు చనిపోయాయి, వైకుంఠ ద్వార దర్శన టిక్కెట్ల జారీలో భక్తులు మరణించారని చెప్పడం ఎంత వరకు సబబు? భూమన చైర్మన్‌గా ఉన్న సమయంలో పోటులో మంటలు రాలేదా? టీటీడీ సూపరింటెండెంట్ రైలు కింద పడి మరణిస్తే మీరు పట్టించుకున్నారా? అపశృతులు గురించి మీరు మాట్లాడటం ఆశ్చర్యంగా ఉంది. రాజకీయ విమర్శలు చేయాలే తప్ప వ్యక్తిగత విమర్శలు చేయడం మంచిది కాదు.

- తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్

బక్క చిక్కుతున్న రొయ్య!



ఆరోగ్య వంతమైన వేనామి తల్లి రొయ్య



టైగర్ తల్లి రొయ్య

రొయ్య బక్క చిక్కుతోంది. సీడ్ సరిగా లేకపోవడం, కొందరు హేచరీల వాళ్లు మిక్సింగ్ సీడ్ వల్ల 60 రోజులకు వంద కౌంట్‌కు రావాల్సిన రొయ్యపిల్లలు.. 80 రోజులైనా 120 కౌంట్‌కు కూడా రావడం లేదు. దీనివల్ల అదనంగా రొయ్యకు మేత, బరువు పెరగకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఒకటిలో.. 8వ నెంబరు సీడ్ కలపడం వల్ల ఈ పరిస్థితి తలెత్తిందని రైతులు అంటున్నారు.

- కోట, ఆంధ్రజ్యోతి


రోజులు గడిచినా 'కౌంట్'రాక నష్టపోతున్న ఆక్వా రైతులు

మిక్సింగ్ సీడే కారణమంటూ ఆరోపణలు



కోట మండలంలో పెరుగుదల లేకనే రొయ్యలను పట్టేస్తున్నరైతులు

రొయ్యల సాగుతో ఏడాది కిందటి వరకు ధరలు రాక, వ్యాధుల బారినపడి రొయ్యలుచని పోతూ, ఆక్వా రైతులు నష్టపోయారు. ఈ ఏడాది ప్రారంభదశలో కొంత ఊరట వచ్చినా.. మిక్సింగ్, నాసిరకం సీడ్‌తో నష్టపోతున్నారు. ఒక్కసారిగా తల్లిరొయ్య రేటుపెరిగిపోయిందంటూ హేచరీలు బలహీనంగా ఉండి.. ఆరోగ్యవంతంగా లేని రొయ్యలను మార్కెట్‌లోకి వదులుతుండటంతో ఆక్వా రైతులు విలవిలలాడిపోతున్నారు. ఉమ్మడి నెల్లూరుజిల్లాలో వంద రొయ్యల హేచరీలు ఉండగా, అందులో కోట, వాకాడులలో 18 ఉన్నాయి. ఆయా హేచరీలకు అమెరికాలోని మియామీ, మెక్సికో దేశాల నుంచి తల్లి రొయ్యలు (బ్రోడర్) దిగుమతి అవుతాయి. ఆయా దేశాల నుంచి చెన్నైకు చేరుకొనే తల్లి రొయ్యలను నెల పాటు క్వారంటైన్‌లో ఉంచుతారు. ఆ తర్వాత హేచరీలకు సరఫరా చేస్తారు. ఇదే తల్లి రొయ్య (వెనామి) గతంలో 7 వేలు పలకగా, ప్రస్తుతం 10వేలు (92 డాలర్లు) పలుకుతుంది. హేచరీల యజమానులు ఈ తల్లి రొయ్యలను తీసుకొచ్చి రొయ్యపిల్లలను ఉత్పత్తి చేస్తుంటారు. ఒక తల్లి రొయ్య నుంచి 6 నెలల పాటు 5 సార్లు రొయ్య పిల్లలను ఉత్పత్తి చేస్తారు. ఒక్కో దఫా.. ఒక తల్లి రొయ్య 3 లక్షల నుంచి 4 లక్షల వరకు రొయ్యపిల్లలను ఉత్పత్తి చేస్తాయి. ఈ ప్రకారం.. ఉత్పత్తిఅయిన రొయ్య పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటాయి. అయితే హేచరీల యజమానులు పెరిగిన తల్లి రొయ్య ధరలు.. రైతుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని 6 నెలల వరకే ఉత్పత్తి చేయాల్సిన తల్లి రొయ్యల నుంచి 8 నెలల వరకు బలహీనమైన, ఆరోగ్యవంతంగాలేని రొయ్యలను ఉత్పత్తి చేస్తున్నారు. అలా ఉత్పత్తి అయిన రొయ్య పిల్లలను మొదటి నెలలో ఉత్పత్తి అయిన రొయ్యపిల్లలతో మిక్సింగ్ చేసి రైతులకు విక్రయాలు చేస్తున్నారు. అంటే.. ఒకటో నెంబరులో 8వ నెంబరు సీడ్ (రొయ్య పిల్లలు) కలిపి అమ్ముతున్నారు. దీనివల్ల 60 రోజులకు వంద కౌంట్‌కు రావాల్సిన రొయ్యపిల్లలు.. 80 రోజులైనా 120 కౌంట్‌లకు కూడా రావడం లేదు. దీనివల్ల అదనంగా 20 రోజులపాటు మేత వేసినా.. సరైన కౌంట్ రాక ఆక్వా రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. ఉమ్మడి నెల్లూరుజిల్లాలోనూ కొన్ని హేచరీల నుంచి వచ్చే సీడ్ సక్రమంగా లేదని, రొయ్య పిల్లల్లో పెరుగుదల లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుదల లేకుండానే రొయ్య పిల్లలను పట్టేసి నష్టానికి అమ్ముకుంటున్నారు. ఆంధ్రా హేచరీల కన్నా తమిళనాడు, పాండిచ్చేరి, ఒడిశా రాష్ట్రాల్లోని హేచరీలలో ఎక్కువగా రొయ్యల సీడ్ మిక్సింగ్ జరుగుతుందన్న ఆరోపణలున్నాయి. దీంతో రొయ్యల గుంటల్లో లక్షల్లో పోసిన సీడ్ (రొయ్యపిల్లలు) వేలల్లోకి రావడం, పెరుగుదల లేకపోవడంతో కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల్లోని ఆక్వారైతులు లబోదిబోమంటున్నారు.



బొమ్మల 'కొలువు'

'చవితి' పూజల కోసం వివిధ ఆకృతులు, కళారూపాలతో తిరుపతిలోని బొమ్మల క్వార్టర్స్‌లో వినాయక ప్రతిమలు సిద్ధమవుతున్నాయి.

6

తిరుమలలో నాగచైతన్య, శోభిత



తిరుమల, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో పలువురు సినీ ప్రముఖులు దర్శించుకున్నారు. హీరో అక్కినేని నాగచైతన్య, శోభిత దూళిపాళ్ల దంపతులు, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, కన్నడ నటి తార, సౌమ్య రెడ్డి ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు నాగచైతన్య దంపతులను చూసేందుకు పలువురు అభిమానులు ఉత్సాహం చూపారు.



30 నుంచి 50 పడకలకు

నారావారిపల్లె ప్రభుత్వాస్పత్రి స్థాయి పెంచుతూ మంత్రిమండలి నిర్ణయం

తిరుపతి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు స్వగ్రామమైన చంద్రగిరి మండలం నారావారిపల్లిలో ప్రభుత్వాసుపత్రి స్థాయి పెరిగింది. ఆ మేరకు గురువారం అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రిమండలి నిర్ణయించింది. ఏపీ వైద్య విధాన పరిషత్ నియంత్రణలో నడుస్తున్న ఈ ఆస్పత్రి ఇప్పటి వరకూ 30 పడకల స్థాయిలో వుంది. అయితే దాన్ని 50 పడకల స్థాయికి పెంచడంతో పాటు పోస్టుల మంజూరులో ఆర్థిక చిక్కులు ఎదురు కాకుండా ఇప్పటికే మంజూరైన పోస్టుల స్థానంలో 18 అదనపు పోస్టులను సృష్టించేలా వైద్యారోగ్య శాఖ చేసిన ప్రతిపాదనను మంత్రిమండలి ఆమోదించింది. కాగా నారావారిపల్లి ఆస్పత్రి స్థాయి పెంపు వల్ల చంద్రగిరితో పాటు పాకాల, పులిచెర్ల, చిన్నగొట్టిగల్లు తదితర చుట్టుపక్కల మండలాలకు చెందిన సుమారు 56 వేల మంది వైద్యారోగ్య సేవలు పొందనున్నారు.

నేడు పుంగనూరుకు కృష్ణాజలాలు

● మదనపల్లెలో హారతిచ్చి స్వాగతం పలికిన ఎమ్మెల్యే షాజహాన్ బాషా

పుంగనూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పడమటి ప్రాంత రైతులు చాలాకాలంగా ఎదురుచూస్తున్న కృష్ణాజలాలు శుక్రవారం నుంచి పరవళ్లు తొక్కనున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆగిపోయిన హంద్రీనీవా ప్రాజెక్టు పనులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరుగులు తీశాయి.సీఎం, జలవనరుల శాఖమంత్రి పనులను పర్యవేక్షించడంతో అధికారులు పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేశారు. రూ.530 కోట్లతో 265 కిలోమీటర్ల కాల్వ విస్తరణ, అభివృద్ధి పనులు చేసినట్లు హంద్రీనీవా ప్రాజెక్టు ఎస్‌ఈ విఠల్‌ప్రసాద్ వివరించారు.కాల్వల హెచ్చుతగ్గులను సమం చేయడం, సిమెంట్ లైనింగ్, బెడ్ వర్క్, లిఫ్ట్ పనులు, కాల్వ విస్తరణ పనులు చేపట్టామన్నారు. కాల్వ గట్టుపై వాహనం వెళ్లేలా దారి ఏర్పాటు చేశామన్నారు. నంద్యాల జిల్లా మాల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద కృష్ణా జలాలను గత నెల 17వ తేదిన సీఎం చంద్రబాబు హంద్రీనీవా కాల్వలకు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆ నీళ్లు ఇటీవల అనంతపురం జిల్లా చెర్లోపల్లె రిజర్వాయర్‌కు,అక్కడినుంచి గురువారం మదనపల్లె మండలం చిప్పిలి వద్దకు చేరుకున్నాయి.ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రత్యేక పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చారు.మదనపల్లె పట్టణ ప్రజలకు తాగునీరు అందించే రెండు సమ్మర్ స్టోరేజి ట్యాంకుల మొరవల నిర్మాణానికి రూ.14కోట్లతో ప్రతిపాదనలు పంపారని, నిధులు మంజూరు కాగానే దాహార్తి తీరుస్తామన్నారు. కాగా రాత్రి 9-30 గంటలకు మదనపల్లె నవోదయ పాఠశాల వద్దకు కృష్ణాజలాలు చేరాయి. శుక్రవారం ఉదయం పుంగనూరు మండలం ఈడిగపల్లె, నేతిగుట్లపల్లెకు చేరుకుంటాయని ఎస్‌ఈ విఠల్‌ప్రసాద్ తెలిపారు. చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి 300 క్యూసెక్కులు నీరు విడుదల కాగా కాల్వల్లో 250 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నాయన్నారు.350 క్యూసెక్కుల సామర్థ్యం వున్న హంద్రీనీవా కాలువలో గంటకు రెండు కిలోమీటర్ల వేగంతో నీరు ప్రవహిస్తోందన్నారు. ఈనెల 26వ తేదీలోపు కుప్పం సమీపంలోని పరమసముద్రం చెరువుకు నీరు చేరుకుంటాయన్నారు.పుంగనూరు నియోజకవర్గంలోకి హంద్రీనీవా కాల్వల ద్వారా కృష్ణాజలాలు ప్రవేశించడం సంతోషకరమని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.ఎన్నికల హామీని చంద్రబాబు నెరవేర్చడంతో ప్రజలకు ఇక తాగు, సాగునీటి కష్టాలు తీరినట్టేనన్నారు.



చిప్పిలి వద్ద కృష్ణా జలాలకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టు చైర్మన్‌గా దాసరి శ్రీనివాసులు

● బొమ్మదేవర వెంకటసుబ్బారావు స్థానంలో నియమించిన ప్రభుత్వం

తిరుపతి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టు చైర్మన్‌గా దాసరి శ్రీనివాసులు నియమితులయ్యారు. తిరుపతికి చెందిన ఆయన బీజేపీలో కొనసాగుతున్నారు. గతేడాది జనవరి 10వ తేదీన ట్రస్టు చైర్మన్‌గా నియమితులైన బొమ్మదేవ వెంకట సుబ్బారావు పదవీకాలం వచ్చే ఏడాది జనవరి దాకా ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆయన స్థానంలో దాసరి శ్రీనివాసులును నియమించింది. దీంతో బొమ్మదేవర వెంకటసుబ్బారావు పదవీకాలాన్ని ప్రభుత్వం అర్ధంతరంగా రద్దు చేసినట్టయింది. కొత్తగా నియమితులైన దాసరి శ్రీనివాసులు ట్రస్టు చైర్మన్‌గా రెండేళ్ల పాటు కొనసాగనున్నారు. ఈ మేరకు రాష్ట్ర దేవదాయశాఖ కార్యదర్శి జి.జయలక్ష్మి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం దేవదాయ శాఖ పరిధిలో హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్టును 2015లో ఏర్పాటు చేసింది. దీనికి వివిధ ఆలయాల నుంచీ కామన్ గుడ్ ఫండ్ ద్వారా నిధుల కేటాయింపు జరుగుతోంది.హిందూ ధర్మాన్ని, ఆచార వ్యవహారాలను, సంస్కృతీ సాంప్రదాయాలను ప్రచారం చేయడం, ప్రోత్సహించడం ఈ ట్రస్టు ఏర్పాటు ఉద్దేశాలు.

వెంకన్నకు వేడుకోలు

● తలనీలాలు సమర్పించి శ్రీవారిమెట్టు చిరువ్యాపారుల నిరసన

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం ఏడాదిగా దీక్ష చేస్తున్నా టీటీడీ అధికారుల్లో స్పందన లేకపోవడంతో నిరశన దీక్షకు దిగాల్సి వస్తుందని శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు స్పష్టం చేశారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం ఎదుటనున్న దీక్షా శిబిరంలో గురువారం 'వెంకన్నకు వేడుకోలు' పేరుతో తలనీలాలు సమర్పించి, తిరునామాలు ధరించి నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ ఎక్కడో పులి వస్తుందనే పేరుతో చిరు వ్యాపారులపై కక్ష సాధింపులకు దిగడం దారుణమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ పీ4 పేరిట బంగారు కుటుంబాలను తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్న సీఎం ఏడాదికిపైగా ఉపాధి కోల్పోయిన ఈ 30 కుటుంబాల గురించి ఆలోచించాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, టి.సుబ్రమణ్యం, ఆర్.లక్ష్మి, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, చిరువ్యాపారులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో శ్రీవారిమెట్టు చిరు వ్యాపారుల సంఘం నాయకులు మధు, చిట్టిబాబు, యుగంధర్, గణేష్, రాంబాబు, రామ్మూర్తి, మల్లి, నరసింహులు, ప్రకాష్, సోనూ, పెంచులయ్య, మునెయ్య, చిరంజీవి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



తలనీలాలు సమర్పిస్తున్న చిరు వ్యాపారులు

కేర్‌టేకరే హంతకుడు

● 8 గ్రాముల కమ్మల కోసం వృద్ధురాలి హత్య
● నిందితుడి కోసం గాలిస్తున్న పోలీసులు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, పోలీసులు - ధనలక్ష్మి (ఫైల్ ఫొటో)

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తికి అతడు కేర్‌టేకర్. ఏడాదిగా ఆ ఇంట్లో వాళ్లతో బాగా ఉంటూ, నమ్మకం పెంచుకున్నాడు. ఎనిమిది గ్రాముల కమ్మల కోసం ఆ ఇంట్లోని వృద్ధురాలిని హతమార్చాడు రవి. ఇతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. తిరుపతికి చెందిన షణ్ముగం కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నారు. ఇతడి కుమారుడు శివ ఆనంద్ హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. తన తండ్రి కోసం ఇటీవల తిరుపతి- రేణిగుంట రోడ్డులోని సీపీఆర్ విల్లాస్‌లో ఒక ఫ్లాటు కొన్నారు. తండ్రికి కేర్‌టేకర్ కోసం విజయవాడలోని ఒక ఏజెన్సీని సంప్రదించారు. విజయవాడ సమీపంలోని తిరువూరుకు చెందిన రవిని ఆ ఏజెన్సీ ఏడాది క్రితం ఎంపిక చేసి తిరుపతికి పంపింది. ప్రతినెలా రవికి రూ.24,000 జీతం చెల్లిస్తుండగా, ఇందులో ఏజెన్సీ రూ 9,000 పట్టుకుని 15,000 ఇచ్చేవారు. ఈ జీతం చాలదని రవి ఆగిపోవడంతో.. శివ ఆనంద్ నేరుగా అతడినే సంప్రదించి నెలకు రూ.22 వేల జీతం ఇస్తామని ఒప్పించారు. అప్పటి నుంచి షణ్ముగంకు అవసరమైన సేవలు చేస్తున్నాడు. షణ్ముగం సోదరి ధనలక్ష్మి కూడా కొంతకాలంగా వీరితో ఉంటున్నారు. కాగా, వర్క్ ఫ్రం హోం చేస్తున్న శివ ఆనంద్‌కు కంపెనీ నుంచి ఫోన్ చేసి హైదరాబాదులోని మీటింగ్‌కు రావాలని పిలిచారు. దీంతో బుధవారం సాయంత్రం అతడు వెళ్లిపోయారు. ఆ రాత్రి దివానాపై నిద్రిస్తున్న శివ ఆనంద్ మేనత్త ధనలక్ష్మి(73) చెవిలో ఉన్న దాదాపు 8 గ్రాముల బంగారు కమ్మలు కాజేయాలనే దురాశతో రవి ఆమె హత్యకు పథకం వేశాడు. అర్ధరాత్రి సమయంలో ఆమె గొంతుకోసి బంగారు కమ్మలు లాక్కొన్నాడు. తాను ధరించిన దుస్తులు అక్కడే మరో దుస్తులు వేసుకుని పరారయ్యాడు. గురువారం ఉదయం ఇంటికొచ్చిన పనిమనిషి బుజ్జమ్మ.. అక్కడి దృశ్యాన్ని చూసి ఆందోళన చెందారు. వెంటనే శివ ఆనంద్‌కు ఫోన్ చేసి చెప్పగా.. అతడు అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ భక్తవత్సలం, సీఐ రాంకిషోర్, ఎస్‌ఐలు నాగార్జున రెడ్డి, లోకేష్‌బాబు, వేలి ముద్రల నిపుణులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇంట్లో పనిచేస్తున్న కేర్‌టేకర్ ఈ హత్యకు ఒడి గట్టినట్లు సీసీ ఫుటేజీల ద్వారా గమనించారు. రక్తం మరకలున్న రవి దుస్తులను సీజ్ చేశారు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.


త్రివిక్రమ్


తారా


సౌమ్య రెడ్డి


గ్రీష్మ, ప్రతిభా భారతి

తిరుమలలో సినీ నటుల సందడి


తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. సినీనటులు అక్కినేని నాగచైతన్య, శోభిత దూళిపాళ్ల దంపతులు, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, కన్నడ నటి తార, సౌమ్యరెడ్డి బ్రేక్ సమయంలో దర్శనం చేసుకున్నారు. ఇంకా మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, ఎమ్మెల్సీ గ్రీష్మ, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, నృత్య కళాకారిణి ఆనంద శంకర్ జయంతి స్వామి దర్శనం చేసుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

గదిలో మర్చిపోయిన బంగారు బ్రాస్‌లెట్ భద్రంగా అప్పగించిన అటెండర్

తిరుమల, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చి గదిలో మర్చిపోయిన బంగారు బ్రాస్‌లెట్‌ను టీటీడీ సిబ్బంది తిరిగి భక్తుడికి అందజేశారు. ప్రకాశం జిల్లాకు చెందిన కల్లూరి వెంకట సుబ్బారావు అనే భక్తుడు కృష్ణసదన్‌లో గదని ఖాళీ చేసే హడావుడిలో పర్సు, రూ.1.10 లక్షల విలువైన బ్రాస్‌లెట్, చేతి గడియారం మర్చిపోయి వెళ్లిపోయారు. అక్కడ అటెండర్‌గా పనిచేస్తున్న మహీధర్‌రెడ్డి గుర్తించి సూపరింటెండెంట్ విజయకుమార్‌కు అందజేశారు. అనంతరం భక్తుడికి వాటిని అప్పగించారు.

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 5 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.45 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,688

తలనీలాలు సమర్పించినవారు: 29,099

బొమ్మల 'కొలువు'





వారి చేతిలో మట్టి వివిధ రూపాలను సంతరించుకుంటుంది. విగ్రహాలుగా ఆవిష్కృతమవుతుంది. దైవమే దిగివచ్చిన భావన కలగజేస్తుంది. తిరుపతిలో దశాబ్దాలుగా కొన్ని కుటుంబాలు కళను వారసత్వంగా కొనసాగిస్తూ విగ్రహాల తయారీలో విశిష్టతను చాటుకుంటున్నాయి.1960లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన షణ్ముగం.. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా తిరుపతిలో స్థిరపడ్డారు. ప్రస్తుతం విగ్రహాల తయారీదారులకు ఆయనే ఆద్యుడు. రకరకాల బొమ్మల తయారీలో ఆయనది అందెవేసిన చేయి. ఆయన స్ఫూర్తితో తర్వాత పాతిక కుటుంబాలు వచ్చి అదేబాటను అనుసరించాయి. 1983లో హైదరాబాదులో వీరు తయారుచేసి ప్రదర్శించిన 'కాళంగికృష్ణుడు' మట్టి బొమ్మను చూసి నాటి ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ ముచ్చటపడ్డారు. నంది అవార్డును కూడా బహూకరించారు. 1984లో ఈ కుటుంబాలకు ప్రభుత్వం మంగళం ప్రాంతంలోని చటర్జీనగర్‌లో ఇళ్ల స్థలాలు కేటాయించింది. కాలక్రమేణా ఇదే బొమ్మలక్వార్టర్స్‌గా ముద్రపడింది. ఏడాదిపొడవునా విగ్రహాలు తయారుచేయడమే ఇక్కడి వారి జీవనాధారమైంది. పండగ లొస్తే చేతినిండా పనే. ప్రస్తుతం వినాయక చవితి సమీపిస్తున్న క్రమంలో వందలకొలదీ విగ్రహాల తయారీలో వీరంతా తలమునకలయ్యారు. మూడు అంగుళాల నుంచి 18అడుగుల ఎత్తు వరకు విగ్రహాలను తయారుచేస్తున్నారు. పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని నీటిలో కరిగిపోయే మెటీరియల్స్ మాత్రమే వినియోగిస్తున్నామని షణ్ముగం మనవడు తిరుమలప్రసాద్‌బాబు చెప్పారు. ఆర్డర్ల మేరకు ట్రెండుకు అనుగుణంగా వివిధ ఆకృతుల్లో విగ్రహాలు రూపుదిద్దుకుని ఆకట్టుకుంటున్నాయి. రూ.5వేల నుంచి రూ.70వేల వరకు వీటి ధర ఉంటుందని చెబుతున్నారు. ఇక్కడ తయారుచేసే బొమ్మల్లో ఎక్కువశాతం తమిళనాడు, కేరళ, కర్నాటక నుంచి వచ్చి కొనుగోలు చేస్తున్నారు. నెలరోజుల ముందునుంచే విగ్రహాల తరలింపు మొదలవుతుంది.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి
















30, 31 తేదీల్లో తిరుమల నంబి మహోత్సవాలు

తిరుమల, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైష్ణావాచార్యులు తిరుమలనంబి 1,052వ అవతార మహోత్సవాన్ని ఈనెల 30, 31వ తేదీల్లో నిర్వహించనున్నారు. తిరుమల దక్షిణ మాడవీధులోని తిరుమలనంబి ఆలయంలో 16 మంది ప్రముఖ పండితులు తిరుమలనంబి జీవిత చరిత్రపై ఉపన్యసించనున్నారు. శ్రీవారి భక్తాగ్రేసరులలో ఒకరైన తిరుమలనంబి భగవద్రామానుజుల వారికి మేనమామ, గురుతుల్యులు.

ఆ మూడు మండలాలను తిరుపతి జిల్లాలో కలపండి

● సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే భానుప్రకాష్ వినతి


సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గంలోని నగరి, విజయపురం, నింద్ర మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. గురువారం అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రిని ఆయన కలిశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మరమగ్గ కార్మికులకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు చేయడంపై నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను చంద్రబాబుకు వివరించారు. కోసలనగరం పారిశ్రామిక కేంద్రం అభివృద్ధికి చర్యలు తీసుకుని యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విన్నవించారు. గాలేరు-నగరి ప్రాజెక్టుకు సంబంధించి పుత్తూరులో ఉన్న వేణుగోపాల సాగర్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తికి ఆర్థిక సహకారం అందించాలని కోరారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరుకు సంబంధించిన వినతులు అందజేశారు. స్పందించిన సీఎం నియోజకవర్గ అభివృద్ధికి అన్నివిధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు.

ప్రసన్నుడి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

వడమాలపేట,ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం అప్పలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామిని గురువారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ప్రధాన అర్చకుడు సూర్యకుమారాచార్యులు అభయ హస్తదీశుడి ఆలయ చరిత్రను జస్టిస్ సంజయ్ కరోల్‌కు వివరించారు. ఆశీర్వచనం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారి వేణుగోపాల్ దర్శన ఏర్పాట్లు చేశారు.



తొలగించిన పింఛన్లు పునరుద్ధరించండి

● కలెక్టరేట్ వద్ద దివ్యాంగుల ఆందోళన ● కలెక్టర్ హామీతో విరమణ



తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తొలగించిన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలంటూ గురువారం కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగారు. తప్పిదాలకు తావిచ్చేలా సదరం సర్టిఫికెట్లను రద్దుచేసిన వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. శాస్త్రీయంగా రీవెరిఫికేషన్ చేయకనే జిల్లాలో 20వేలమంది పింఛన్లు తొలగించడం దుర్మార్గమన్నారు. వందశాతం వికలత్వం ఉన్నా పింఛను ఎలా రద్దు చేస్తారని ప్రశ్నించారు. కలెక్టర్ వచ్చి తమ సమస్యను పరిష్కరించేంత వరకు కదిలే ప్రసక్తే లేదంటూ కలెక్టరేట్ రెండు ప్రధాన ద్వారాలను దిగ్బంధించారు. రోడ్డుపై పడుకుని ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్‌లోకి ఎవరినీ వెల్లనీయలేదు. చివరకు డీఆర్వో నరసింహులు వద్దకు వచ్చి నచ్చచెప్పినా ససేమిరా అన్నారు. దాదాపు మూడు గంటల పాటు కలెక్టరేట్‌ను దిగ్బంధం చేసి చేసి దివ్యాంగులు ఆందోళన చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు పెద్దసంఖ్యలో చేరుకుని నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. వైసీపీ నేత భూమన అభినయ్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు తదితరులు వారికి సంఘీభావం ప్రకటించారు. చివరకు వాకాడు పర్యటనలో ఉన్న కలెక్టర్ వెంకటేశ్వర్‌తో డీఆర్వో నరసింహులు ఆందోళనకారులతో ఫోన్‌లో మాట్లాడించగా, ఆయన హామీతో నిరసన విరమించారు. కాగా, ఎక్కువసేపు ఎండలో ఉండటంతో జేఏసీ నాయకురాలు సుమతి స్పృహ తప్పి పడిపోవడంతో పోలీసులు ఆస్పత్రిని తరలించారు. ఈ నిరసనలో దివ్యాంగుల జేఏసీ నేతలు మురళీగౌడ్, మురళి, రామచంద్ర, గోవర్ధన్, చిట్టెమ్మ, చెంచులక్ష్మి, కాంచన, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల అంతర్ జిల్లా బదిలీలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు అంతర్ జిల్లా బదిలీలకు దరఖాస్తులు అందించాలని డీఈవో కేవీఎన్ కుమార్ కోరారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపధ్యాయులు, ఉపాధ్యాయులు, వారి సంబంధిత మేనేజ్‌మెంట్లకు స్పౌస్, పరస్పర బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. బదిలీలు ఆశిస్తున్న వారు ఈనెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. 21 నుంచి 24వ తేదీలోపు ఆన్‌లైన్ విధానంలో లీప్ యాప్ ద్వారా దరఖాస్తు సమర్పించి, ఆ ప్రింటవుట్‌ను సంబంధిత ఎంఈవోలకు సమర్పించాలని పేర్కొన్నారు. దరఖాస్తులను ఎంఈవోలు 25వ తేదీలోపు పరిశీలించి తదుపరి జాబితాను పరిశీలనార్థం డీఈవోకు పంపాల్సి ఉంటుందని తెలిపారు. వాటిని 26వ తేదీలోపు డీఈవో పరిశీలించి 27వ తేదీన పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు సమర్పించనున్నారని పేర్కొన్నారు. బదిలీల ప్రతిపాదనలను రాష్ట్రస్థాయిలో పరిశీలించి 30వ తేదీన ఫైనల్ జాబితాను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు వెల్లడించారు.

తిరుపతి ప్రాంతీయ విజిలెన్సు ఎస్పీకి ఐపీఎస్ హోదా

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రాంతీయ విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్‌కు ఐపీఎస్ హోదా నిర్ధారిస్తూ ప్రభుత్వం గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో నాన్ క్యాడర్ ఎస్పీలుగా పనిచేస్తున్న 14 మందికి ఐపీఎస్ హోదా కల్పించిన విషయం విదితమే. ఈ గెజిట్‌ను నిర్ధారిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నోటిఫికేషన్ జారీ చేయడంతో గురువారం నుంచి కరీముల్లా షరీఫ్ ఐపీఎస్ హోదా లభించింది. ఐపీఎస్ హోదాలో త్వరలో ఆయన్ను ఎస్పీగా ఏదో ఒక జిల్లాకు నియమించనున్నారు.

'సాగరమాల' సర్వీసు రోడ్డుకు కృషి

● రైతులకు కలెక్టర్ హామీ


రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

నాయుడుపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): 'సాగరమాల' రహదారికి సర్వీసు రోడ్డు కోసం కృషి చేస్తానని రైతులకు కలెక్టర్ వెంకటేశ్వర్ హామీఇచ్చారు. నాయుడుపేట ప్రాంతంలో సాగరమాల రోడ్డు పనులను గురువారం ఆయన పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడారు. పుదూరు, విన్నమాల, పెరికలంపాటికండ్రిగ, మర్లపల్లి, అన్నమేడు, కాపులూరు, చిలమత్తూరు గ్రామాలలో సాగరమాల రోడ్డు కోసం దాదాపు 300 ఎకరాలను అందజేసినట్లు తెలిపారు. దాదాపు 14 అడుగుల ఎత్తున సాగరమాల రోడ్డు వేయడంతో ఇరువైపుల ఉన్న తమ పొలాలకు వెళ్లే అవకాశం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. సాగరమాల భూసేకరణ సమయంలో అధికారులు ఇచ్చిన హామీ ప్రకారం సర్వీస్‌రోడ్డు ఏర్పాటు చేయాలని, తద్వారా పొలాలకు వెళ్లే దారితోపాటు ఆప్రాంత గ్రామాలకూ వెళ్లే అవకాశం ఉంటుందని కలెక్టర్‌కు విన్నవించారు. అక్కడ పరిస్థితిని గమనించిన కలెక్టర్.. అండర్‌బ్రిడ్జికి అనుసంధానంగా రోడ్డు ఏర్పాటుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే పీడీ ఎంకే చౌదరి, ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దారు రాజేంద్ర, రైతులు జలదంకి వెంకటకృష్ణారెడ్డి, సన్నారెడ్డి హరనాథ్‌రెడ్డి, మచ్చా భాస్కర్, కామిరెడ్డి విజయసారథిరెడ్డి, నల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, మధుసూదనరెడ్డి తదితరులు ఉన్నారు.

స్వర్ణముఖి బ్యారేజీ మరమ్మతులకు ప్రతిపాదనలు

వాకాడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వాకాడు ప్రాంతంలో స్వర్ణముఖి నదిపై నిర్మించిన బ్యారేజీ మరమ్మతులకు రూ.3 కోట్లతో ప్రతిపాదనలు పంపుతున్నామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ బ్యారేజ్‌ను గురువారం పరిశీలించిన ఆయన.. బ్యారేజీ గేట్, రోపులకు క్రమం తప్పకుండా గ్రీస్, ఆయిల్ వేయకపోవడంతో తుప్పుపట్టి మరమ్మతులకు గురయ్యాయని చెప్పారు. ఏడాదిలోపు బ్యారేజీకి మరమ్మతులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. బ్యారేజీలో నీటి నిల్వతో కోట, వాకాడు మండలాల్లో సుమారు 10వేల ఎకరాలకు సాగునీరు అందిస్తుందన్నారు. తెలుగుగంగ నీటిని రబీ, ఖరీఫ్ పంటలకు అందేలా చూస్తామన్నారు. సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన, ఇరిగేషన్ ఎస్ఈ రాధాకృష్ణ, ఈఈ బాబు తదితరులున్నారు.

నిధుల కోసం తవ్వకాలు

● ఏడుగురి అరెస్ట్, ఎక్స్‌కవేటర్ సీజ్


నిందితులను, ఎక్స్‌కవేటర్‌ను చూపుతున్న పోలీసులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నిధుల కోసం పొలంలో ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు జరిపిన కేసులో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడు పోలీసుస్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అలత్తూరు గ్రామానికి చెందిన ఉమాశ్వర రెడ్డి తన బావమరిది ధనంజయరెడ్డికి చెందిన 30 ఎకరాలలో నీలగిరి చెట్లు పెంపకం చేపట్టి ఉన్నారు. ఈ పొలంలో పురాతన తులసికోట ఉంది. ఆ తులసికోట కింద నిధులు ఉన్నాయనే అనుమానంతో ఈ నెల 18న పొలంలో రాత్రి పూట కొందరు తవ్వకాలు జరిపారు. తోటకు కాపలా ఉన్న వ్యక్తి గుర్తించి ఉమాశ్వరరెడ్డికి విషయం తెలియజేయడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు రెడ్డిగుంటబాడవ గ్రామానికి చెందిన ఎ.గురవయ్య, బీ.గురవయ్య, ఓజిలి మండలం హరివరం గ్రామానికి చెందిన చంద్రశేఖర్, అనిల్, హరీష్, అశోక్, శేఖర్‌లను అరెస్టు చేశారు. కేసు నమోదు చేశారు.

స్విమ్స్ మెడికల్ షాపునకు మూడు టెండర్లు

తిరుపతి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌కు అనుబంధంగా ఉన్న శ్రీపద్మావతి ఆస్పత్రి ఎదుటగల మెడికల్ షాపుకు ఆహ్వానించిన ఈ- టెండర్లను గురువారం టీటీడీ రెవెన్యూ అధికారులు టెక్నికల్ బిడ్‌ను తెరిచారు. మూడు దరఖాస్తులు వచ్చినట్టు గుర్తించారు. టెండరు నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తులు ఉన్నాయా?లేదా? అని పరిశీలిస్తున్నట్టు తెలిసింది. జీఎస్టీ, బ్యాంక్ టర్నోవర్ వంటివాటిని పరిశీలించి టీటీడీ నిర్దేశించిన రూ.15లక్షల కన్నా ఎక్కువ అద్దెను ముగ్గురిలో ఎవరు కోట్ చేసుంటారో వారిని ఎంపికచేయనున్నట్టు టీటీడీ రెవెన్యూ వర్గాలు తెలిపాయి.

పకడ్బందీగా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను పగడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం కలెక్టరేట్ నుంచి ఆయన జూమ్ ద్వారా అధికారులతో సమావేశమయ్యారు. ఆదివారం నుంచి 26వ తేదీ వరకు తిరుపతిలో 10 క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 24న తారకరామా స్టేడియంలో ప్రారంభోత్సవం ఉంటుందని, వివిధ జోన్ల నుంచి క్రీడాకారులతోపాటు సుమారు 1,700మంది వస్తున్నారని, వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. క్రీడాకారులకు రవాణా, భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు, చిత్తూరు, తిరుపతి స్పోర్ట్స్ అథారిటీ అధికారులు బాలాజీ, శశిధర్, డీటీసీ మురళీమోహన్, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, డీఈవో కుమార్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

త్వరలో అందుబాటులోకి పంబలేరు వంతెన


● ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్



పంబలేరు వంతెన వద్ద పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా నిలిచివున్న పంబలేరు వంతెనను త్వరలోనే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక పంబలేరు బ్రిడ్జిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణ శివారు ప్రాంతంలో నెల్లూరు వైపు వెళ్లే మార్గంలో పంబలేరువాగుపై గత టీడీపీ హయాంలో వంతెన నిర్మాణం కోసం రూ.18 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ వంతెనను ఐదేళ్లపాటు నిర్మించి అప్రోచ్‌రోడ్లు ఏర్పాటుచేయకపోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయిందన్నారు. అప్రోచ్‌రోడ్ల ఏర్పాటుకు అధికారులతో చర్చించి రూ.9 కోట్ల నిధులు అవసరమవుతాయని ప్రతిపాదనను సిద్ధం చేసినట్లు తెలిపారు. గూడూరు పర్యటనకు వచ్చిన సమయంలో ఆర్‌అండ్‌బీశాఖ మంత్రి జనార్ధన్‌రెడ్డితో కలిసి ఈ ప్రాంతాన్ని పరిశీలించి నివేదిక అందజేశామన్నారు. త్వరలో నిధులు విడుదల చేయించి వంతెన నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈప్రాంతంలోనే తాత్కాలిక రోడ్డును మరమ్మతులు చేయించి వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఆరికట్ల మస్తాన్‌నాయుడు, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్‌కుమార్, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



నాయుడుపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద అంగన్‌వాడీల మానవహారం

నాయుడుపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు అందజేయాలని అంగన్‌వాడీ సంఘ అధ్యక్షులు పుష్ప, కార్యదర్శి శ్యామలమ్మలు అన్నారు. నాయుడుపేటలో గురువారం అంబేడ్కర్ విగ్రహం వద్ద అంగన్‌వాడీలు తమ న్యాయపరమైన కోర్కెల సాధనకోసం మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు సరైన భవనాలు లేక ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ పిల్లలతోపాటు అవస్థలు పడుతున్నారని చెప్పారు. మినీ అంగన్‌వాడీలందరినీ మెయిన్ వర్కర్‌గా తీసుకొని, సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే నిరసనలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి శివకవి ముకుంద, అంగన్‌వాడీ వర్కర్ల సంఘ నాయకులు కళావతి, మునిరత్నమ్మ, జానకి, సంధ్య, విజయమ్మ, స్వర్ణలత, మేరీ ప్రమీల, పెంచలమ్మ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్‌ల ఆధ్వర్యంలో తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు స్వరూప మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.21 వేల వేతనం, గ్రాట్యుటీ, గ్యాస్ సిలిండర్లు అందిస్తామని ఇచ్చిన జీవోను అమలు చేయడంతో పాటు 5జీ నెట్‌వర్క్ ఫోన్లను కార్యకర్తలకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు లక్ష్మిప్రసన్న, స్వర్ణ, కృష్ణవేణి, కళ్యాణి, ధనలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

దక్కిలి: ప్రభుత్వం వెంటనే తమ జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నకు అందచేశారు.

కోట: పనికి తగ్గట్టుగా వేతనాలు పెంచాలని, నిర్లక్ష్యం చేస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు హెచ్చరించారు. కోట తహసీల్దారు కార్యాలయం ఎదుట గురువారం మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఆందోళన, నిరసన కార్యక్రమాలు తెలిపారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జునరావుకు అందజేశారు.



కోట తహసీల్దారు కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి: కలెక్టర్

వాకాడు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఆరోగ్యకేంద్రానికి చికిత్స కోసం వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలని డాక్టర్ జెమ్స్‌కు కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. మండలంలోని స్వర్ణముఖి బ్యారేజీ, సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సబ్ కలెక్టర్ రాఘువేంద్రమీన, ఇరిగేషన్ ఎస్ఈ రాధాకృష్ణ, ఈఈ బాబులతో కలసి కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సామాజిక ఆరోగ్యకేంద్రంలో ఎక్స్‌రే విభాగాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఫార్మసీ గదిలోని మందులను పరిశీలించారు. అనంతరం పలువురు తమ సమస్యలపై కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశారు. కోడివాక గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ సుబ్బారావు, తమ పాఠశాలను 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ముట్టెంబాక పాఠశాలలో కలపడంతో 22 మంది విద్యార్థులు డ్రాప్ అవుట్‌గా ఉన్నారని తెలిపారు. కొండాపురంలో రొయ్యలకాలువ వద్ద రూ.50 లక్షలతో నిర్మించిన ఫ్లడ్‌బ్యాంక్‌ను కాంట్రాక్టర్ నాసిరకంగా నిర్మించడంతో దెబ్బతిందని కొండాపల్లి గ్రామానికి చెందిన మన్నెపల్లి వేణునాయుడు ఫిర్యాదు చేశారు. 10 రోజుల్లో సమస్యలకు పరిష్కారం చూపుతామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు.



సామాజిక ఆరోగ్యకేంద్రంలో ఎక్స్‌రే విభాగాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

గంగ కాలువ భూముల పరిశీలన

చిట్టమూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలం కోగిలిలో తెలుగు గంగ కాలువ కోసం కేటాయించిన భూములను కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం పరిశీలించారు. కోగిలి చెరువుకు తెలుగు గంగ కాలువ నీటిని తీసుకెళ్లేందుకు ఏర్పాటు చేస్తున్న గంగ కాలువ కోసం కేటాయించిన భూముల్లో 400 మీటర్ల మేర రైతులు భూములు ఇచ్చేందుకు అభ్యంతరాలు చెబుతుండగా, ఆ భూములను రికార్డులతో పరిశీలించారు. రైతులను ఒప్పించేలా చూడాలని కోరారు. అంతకు మునుపు ఆయన చిట్టమూరు తహసీల్దారు కార్యాలయాన్ని పరిశీలించారు. ఆయన వెంట గూడూరు సబ్‌కలెక్టర్ రాఘువేంద్రమీనా, చిట్టమూరు తహసీల్దారు కాయల సతీష్‌కుమార్, ఎంపీడీవో మనోహర్‌గౌడ్, ఆర్ఐ సుధా తదితరులు ఉన్నారు.

మోటారు సైకిల్ చోరీ

నాయుడుపేట టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రాహ్మణవీధిలో మోటారు సైకిల్ చోరీకి గురైనట్లు బాధితుడు ఎ.రాజశేఖర్ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన ఇంటి ముందు బుధవారం రాత్రి మోటారు సైకిల్‌ను పార్కుచేసి గురువారం ఉదయం లేచి చూసేసరికి అదృశ్యం కావడంతో పరిసర ప్రాంతాల్లో గాలించాడు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

మంత్రి లోకేష్‌ను కలిసిన మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్



మంత్రి లోకేష్‌కు నోట్‌పుస్తకాలను అందజేస్తున్న బొమ్మన శ్రీధర్

తడ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్ గురువారం ఉండవల్లి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా తనను చైర్మన్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. యువగళం పాదయాత్ర సమయంలో మత్స్యకారులకు ఇచ్చిన హామీల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి లోకేష్ ఆరాతీశారు. అనంతరం నోట్‌పుస్తకాలు, పెన్నులను మంత్రికి అందజేశారు. మంత్రిని కలుసుకున్నవారిలో జయపాల్, ఏకాంబరం, నరసింహంలు ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య



హరిప్రసాద్ (ఫైల్ ఫొటో)

చిల్లకూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుత్తావారిపాళెం సమీపంలోని చీకలతిప్ప ప్రాంతంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకుని మృతి చెంది వుండటాన్ని పోలీసులు గురువారం గుర్తించారు. పోలీసుల వివరాల మేరకు.... కోట ప్రాంతానికి చెందిన హరిప్రసాద్(41) వ్యాపారం నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రయినా ఇంటి రాకపోవడంతో కుటుంబసభ్యులు కోట, వాకాడు, చిల్లకూరు ప్రాంతాల్లో గాలించినా కనిపించకపోవడంతో చిల్లకూరు పోలీసులకు బుధవారం రాత్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ నిర్వహించగా, చీకలతిప్ప ప్రాంతంలో హరిప్రసాద్ మృతదేహాన్ని గుర్తించారు. ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. ఆత్మహత్యకు గల కారణాలను విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారును ఢీకొన్న లారీ

● ఆరుగురికి స్వల్పగాయాలు



లారీ వెనుక వైపు ఢీకొన్న కారు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట-అయ్యప్పరెడ్డిపాళెం జాతీయ రహదారి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... విజయవాడకు చెందిన కుటుంబరావు కుటుంబం చెన్నై నుంచి విజయవాడకు గురువారం బయలుదేరారు. మార్గమధ్యంలో అయ్యప్పరెడ్డిపాళెం జాతీయ రహదారికి సమీపంలోకి రాగానే ముందువెళ్తున్న లారీ నెమ్మదిగా ఆగడంతో వెనుక వస్తున్న కారు ఢీకొంది. అదే సమయంలో కారును వెనుక వైపు నుంచి మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న కుటుంబరావుతోపాటు ఐదుగురికి స్వల్పగాయాలు అయ్యాయి. దీంతో జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

విద్యార్థులు ఆర్థిక అక్షరాస్యత పట్ల అవగాహన కలిగి ఉండాలి



పుస్తకావిష్కరణ చేస్తున్న బ్యాంక్ మేనేజర్లు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆర్థిక అక్షరాస్యతపట్ల అవగాహన కలిగి ఉండాలని కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ రేఖ అన్నారు. నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవెనర్స్ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బ్యాంక్ మేనేజర్లు మాట్లాడుతూ విద్యార్థులు ఆర్థిక ప్రణాళికను రూపొందించుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపట్ల అవగాహన కలిగి ఉండి, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ తెలియజేయకూడదని సూచించారు. ఏపీఎం ఉమాదేవి, ప్రగతి గ్రామీణబ్యాంక్ ఇన్‌చార్జి మేనేజర్ ఖాన్, పీడీ అంజనేయులు, మేనేజర్ అశోక్‌కుమార్, రిసోర్స్ పర్సన్ సతీష్, ట్రైనర్ విజయ్ పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి

వెంకటగిరిటౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఈ నెల 27వ తేదీన నిర్వహించే వినాయక చవితి సందర్భంగా ఉత్సవకమిటీ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సీఐ ఏవీ రమణ అన్నారు. గురువారం స్థానిక పాలకేంద్రం, ఎన్టీఆర్ కాలనీ ప్రాంతాల్లో వినాయక విగ్రహాల తయారీదారుల వద్ద యువతతో మాట్లాడారు. విగ్రహాల ఏర్పాటుకు, ఊరేగింపు కోసం పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో పండుగ వాతావరణంలో జరుపుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఏడుకొండలు, ఏఎస్ఐ రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

గూడూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా సస్పెండ్ చేసిన కండక్టర్ శ్రావణ్‌కుమార్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఎన్‌ఎంయూఏ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శ్రావణ్‌కుమార్‌పై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలన్నారు. డిపో మేనేజర్ మొండివైఖరిని మానుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. ప్రవీణ్, శ్రీనివాసులు, గౌస్, కమలాకర్, కరిముల్లా, వెంకటేశ్వర్లు, సందానీ, బాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చెంగాళమ్మ ఆలయంలో వరలక్ష్మీవ్రత పూజలు

సూళ్లూరుపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీవ్రత పూజలు జరుగుతాయని సహాయ కమిషన్ ప్రసన్నలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన మండపంలో ఉదయం 10 గంటల నుంచి ఈ పూజలు జరుగుతాయని, పాల్గొనే దంపతులు ముందుగానే విచ్చేయాలని పేర్కొన్నారు.

జిల్లాలో రెండు లక్షల మందికి

ఉద్యోగావకాశాల కల్పనే లక్ష్యం

● కలెక్టర్ వెంకటేశ్వర్



నియామకపత్రాలను అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తదితరులు

గూడూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఐదేళ్లలో రెండు లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని లక్ష్యం పెట్టుకున్నామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. గురువారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గతేడాదిలో జిల్లాలో జాబ్‌మేళాలు నిర్వహించి 16వేల మంది నిరుద్యోగ యువతకు పలు పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు కల్పించినట్లు వివరించారు. గూడూరు నియోజకవర్గంలో కృష్ణపట్నం పోర్టుకు అనుసంధానంగా 11వేల ఎకరాల్లో క్రిస్‌సిటీ పారిశ్రామికవాడను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే అక్కడ రూ.1500 కోట్లతో పలు అభివృద్ధిపనులు చేపడుతున్నామన్నారు. నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం సమయాన్ని వృధా చేసుకోకుండా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రైవేటు ఉద్యోగాలపై ఆసక్తిని కనబరుస్తూ అభివృద్ధిని సాధించాలన్నారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు చెప్పిన విధంగానే రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఈ ఐదేళ్లల్లో 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించేలా చర్యలు చేపట్టారన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి మెగా జాబ్‌మేళా నిర్వహిస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. అనంతరం పలు కంపెనీలకు ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాఘువేంద్రమీనా, డీఎస్పీ గీతాకుమారి, తహసీల్దారు ప్రసాద్, ఎంపీడీవో మధుసూదన్‌రావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ మెహర్‌మణి, విద్యాసాగర్‌రావు, డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, హనుమంతరావు, అబ్దుల్‌రహీం, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, బిల్లు చెంచురామయ్య, ఇశ్రాయిల్‌కుమార్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి సర్కార్‌తోనే రైతు సంక్షేమం

● ఎమ్మెల్యే కురుగొండ్ల



సొసైటీ గోదాములను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, నెల్లూరు డీసీసీబీ చైర్మన్, డీసీఎంఎస్ చైర్మన్లు

దక్కిలి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కూటమి సర్కార్ రైతు సంక్షేమ ప్రభుత్వమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం ఆయన నెల్లూరు జిల్లా సెంట్రల్ బ్యాంకు చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ గంగోటి నాగేశ్వరావులతో కలిసి కమ్మపల్లి గ్రామంలో రూ.50 లక్షలతో నూతనంగా నిర్మించిన సొసైటీ గోడౌన్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కొత్తవరవడిని తీసుకొస్తున్నట్లు వివరించారు. రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులను అనుసరించి డిమాండ్ ఉన్న పంటలను సాగుచేస్తే మంచి లాభాలు పొందవచ్చని చెప్పారు. నెల్లూరు జిల్లా సెంట్రల్ బ్యాంకు చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి మాట్లాడుతూ దక్కిలిలో ఎన్‌డీసీ బ్యాంకును ఏర్పాటు చేయాలని రిజర్వు బ్యాంకుకు ప్రతిపాదనలు పంపించామని, అనుమతులు రాగానే బ్యాంకు ఏర్పాటవుతుందన్నారు. ఎన్‌డీసీ బ్యాంకు ఏర్పాటు చేస్తే రైతులకు బంగారంపై రుణాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకొంటామని డీసీఎంఎస్ చైర్మన్ చైర్మన్ గంగోటి నాగేశ్వరావు అన్నారు. ఎన్‌డీసీ బ్యాంక్ జీఎం ఉషారాణి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఎస్ఎస్ నాయుడు, వెంకటగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ పునుగోటి విశ్వనాథ నాయుడు, మాధవాయపాళెం సొసైటీ అధ్యక్షులు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షులు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, స్థల దాతలు నర్రావుల ప్రకాశం నాయుడు, వేణుగోపాల్ నాయుడు, లింగసముద్రం, గొల్లపల్లి సొసైటీ అధ్యక్షులు రంగినేని రాజా, నర్రావుల భాస్కర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



ఎమ్మెల్యే విజయశ్రీ చేతుల మీదుగా సీఎం సహాయ నిధి చెక్కులను అందుకున్న లబ్ధిదారులు

సూళ్లూరుపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన 14 మంది లబ్ధిదారులకు రూ.14,65,715 నగదు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో సీఎం రిలీఫ్ ఫండ్ కొద్దిమందికి మాత్రమే అందేవని సీఎం చంద్రబాబు పేదల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టి కార్పొరేట్ వైద్యశాలలో చికిత్స తీసుకొన్న వారికి సైతం సాయం అందిస్తున్నారన్నారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, అశోక్‌రెడ్డి, అలవల శ్రీనివాసులు, శెల్వం, సురేష్ నాయుడు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దారు జయజయరావు

కోట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామ సభల ద్వారా గ్రామాల్లోకి వస్తున్న రెవెన్యూ అధికారులకు సహకరించి భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దారు కటారి జయజయరావు కోరారు. మండల పరిధిలోని మద్దాలి, కేశవరం, చిట్టేడు గ్రామాల్లో గురువారం భూ సమస్యలపై గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామ సభల్లో పలు భూసమస్యలపై రైతులు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కొన్ని సమస్యలను రెవెన్యూ అధికారులు అక్కడికక్కడే పరిష్కరించారు. తహసీల్దారు జయజయరావు మాట్లాడుతూ గతంలో రెవెన్యూశాఖలో పలు మార్పులు, చేర్పులు చేసుకునేందుకు కొన్ని ప్రక్రియలను అమలులోకి తీసుకురాగా, అడంగల్, వన్‌బి, హక్కు, సాగుదారులు జాబితాలలో తప్పులు దొర్లాయన్నారు. వీటి పరిష్కారానికి గ్రామసభలు నిర్వహిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్ఐ ప్రసాద్, మండల సర్వేయర్ గోపీరెడ్డి, వీఆర్వో సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

సేంద్రియ ఎరువులతో నేలకు సారం

వెంకటగిరిటౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో సేంద్రియ ఎరువుల వాడకం నేల సారానికి మూలంగా మారుతుందని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు అన్నారు. గురువారం స్థానిక యాతలూరులో పీఎం ఆర్కేవీవై పథకం ద్వారా వ్యవసాయంపై రైతులకు శిక్షణ కార్యక్రమం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు, జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట లేదా ఆకు ఎరువులు, జీవన ఎరువులను కలిపి వాడితే రైతుకు ఖర్చు తగ్గుతుందన్నారు. నేలకు సారం, భూమికి ఆరోగ్యం, ఆహార భద్రతతో పాటు, ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. ఏవో సుజాత, సిబ్బంది గురుబ్రహ్మం, రవిప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

సమగ్ర వ్యవసాయంతో రైతుకు ఆదాయం

ఓజిలి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సమగ్ర వ్యసాయ పద్ధతులను పాటించడం ద్వారా రైతుకు ఆదాయం అందుతుందని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వేణుగోపాలరావు అన్నారు. ఓజిలి మండలం గ్రద్దగుంటలో నిర్వహించిన పీఎంఆర్‌కేవై కార్యక్రమంలో భాగంగా రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం ఏఈవో రవిప్రసాద్, గ్రద్దగుంట గ్రామ వ్యవసాయ సహాయకులు దనదీప్, రైతులు పాల్గొన్నారు.

వరిసాగులో మెలకువలపై రైతులకు అవగాహన

చిల్లకూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మనగారిపాళెంలో గురువారం పీఎం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ద్వారా జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ ఏవో భవానీ రైతులకు వరిసాగులో మెలకువలపై అవగాహన కల్పించారు. రైతులు సమగ్ర యాజమాన్యం పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చునన్నారు. వేణుగోపాల్‌రావు, ఏడీ గోపీనాయక్, సుమతి, గాయత్రి, రవిప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

వెంకటగిరిటౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచి ఎయిడ్స్‌పై అవగాహన కల్గి ఉండాలని నవజీవన్ ఆర్గనైజేషన్ ప్రాజెక్టు మేనేజర్ బాలాజీ అన్నారు. గురువారం స్థానిక విశ్వోదయ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్‌పై సందేహాలు ఉంటే టోల్‌ఫ్రీ నెం.1097కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చాన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్లు వెంకటశేషయ్య, రాంగోపాల్, మునికుమారి, శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపు కార్యక్రమంలో భక్తులు

చిల్లకూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరులో వెలసివున్న ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు జరిగింది. 80 రోజులకు గానూ హుండీ ద్వారా రూ.19,38,902 ఆదాయం వచ్చినట్లు ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్, సురేంద్రరెడ్డి, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలి

ఓజిలి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలో రద్దయిన దివ్యాంగుల పింఛను దారులు తిరిగి తమ అర్హతలను తెలియజేస్తూ దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. ఈమేరకు ఆమె వివరాలను తెలిపారు. దివ్యాంగులు వారి పాత సదరమ్ సర్టిఫికెట్‌తోపాటు ప్రస్తుతం సచివాలయంలో అందజేసే సదరమ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, దరఖాస్తుతో ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.


ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు

నాయుడుపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు బీఏ, బీకాం, కంప్యూటర్ అప్లికేషన్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ మైక్రోబయాలజీ కోర్సుల కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదనశర్మ గురువారం తెలిపారు. ప్రవేశానికి ఎటువంటి ఫీజులు అవసరం లేదని, ఉచిత విద్య, హాస్టల్ సౌకర్యం ఉంటుందన్నారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌లు బాలురకు, బాలికలకు అవకాశం ఉంటుందన్నారు. ఆర్టీసీ బస్సుల ఉచిత పాసుల సౌకర్యం ఉంటుందన్నారు.

ఢిల్లీ సీఎంపై దాడి అమానుషం

నాయుడుపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తాపై దాడి అమానుషమని ఆర్యవైశ్య సంఘ యువజన రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూడూరు కిరణ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో ఖండించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న రేఖాగుప్తాపై దాడిచేయడం సామాజిక వర్గాన్ని మనోవేదనకు గురిచేస్తుందన్నారు. దేశంలో ఆర్యవైశ్యులు దాదాపు 18 శాతం ఉన్నప్పటికీ రాజకీయపరంగా సముచితస్థానం లేదన్నారు. ఉన్నవారికి కూడా రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు.

కలిమిలి కుటుంబానికి సజ్జల పరామర్శ



కలిమిలి కుటుంబాన్ని పరామర్శిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి

దక్కిలి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన దక్కిలి జడ్పీటీసీ కలిమిలి రాజేశ్వరి కుటుంబాన్ని గురువారం రాష్ట్ర వైసీపీ కో ఆర్డినేటరు సజ్జల రామకృష్ణారెడ్డి పరామర్శించారు. మండలంలోని చాపలపల్లిలో జరిగిన ఆమె వర్ధంతి సభకు సజ్జల తన సతీమణితో హాజరయ్యారు. రాజేశ్వరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయనతోపాటు మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నెల్లూరు జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మ, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు, మాజీ జడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, శాంప్రసాద్‌రెడ్డి, మస్తాన్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

ఉచిత క్యాన్సర్ పరీక్షలు

బాలాయపల్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) తిరుపతి స్విమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బాలాయపల్లి సచివాలయంలో గురువారం పింక్ బస్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి చైతన్య బీపీ, షుగర్ పరీక్షలతో పాటు మహిళలకు రొమ్ము క్యాన్సర్, పురుషులు, మహిళలకు నోటి క్యాన్సర్ పరీక్షలు 75 మందికి నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి వెంకటరెడ్డి, సిబ్బంది తదితరులు తెలిపారు.